

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI


విజయ దశమి శుభాకాంక్షలు



శనివారం | 12-10-2024 | పేజీలు: 10 + 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 284 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: నవమి ఉ. 10.59 తదుపరి దశమి; నక్షత్రం: శ్రవణం తె. 4.25 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: ఉ. 9.15 -10.47; దుర్ముహూర్తం: ఉ. 6.11-7.44; అమృతఘడియలు: రా. 6.28-8.00; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.11; సూర్యాస్తమయం: 5.51 | శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు సిటీ

Nellore | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru









అభివృద్ధి బాటలో
కోవూరు నియోజకవర్గం

క్యాన్సర్ రహిత కోవూరు నియోజకవర్గమే ధ్యేయంగా
మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ ప్రారంభం



కోవూరు నియోజకవర్గ రైతుల పంట నీళ్ల కొరకు
నాలాల పూడిక తీయుట



కోవూరు నియోజకవర్గ ప్రజల దాహార్తిని తీర్చే
వీ పి ఆర్ అమృత ధార



కోవూరు నియోజకవర్గ యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యంగా
మెగా జాబ్ మేళా



VPR Foundation

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

విజయ దశమి శుభాకాంక్షలు



రాజరాజేశ్వరి ఆలయం ముందు భక్తజనం

శనివారం | 12-10-2024 | పేజీలు: 10+12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 284

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: నవమి ఉ. 10.59 తదుపరి దశమి; నక్షత్రం: శ్రవణం తె. 4.25 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: ఉ. 9.15 -10.47; దుర్ముహూర్తం: ఉ. 6.11-7.44; అమృతఘడియలు: రా. 6.28-8.00; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.11; సూర్యాస్తమయం: 5.51

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు సిటీ

Nellore | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



రావణాసుర విగ్రహంలో నుంచి పేలుతున్న బాణాసంచా, విల్లు ఎక్కుపెట్టిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



నెల్లూరు : మహిషాసురమర్దినిగా రాజరాజేశ్వరి



నెల్లూరు : గజలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి



నెల్లూరు : మహిషాసురమర్దినిగా ఇరగాలమ్మ



నెల్లూరు రూరల్ : వేదగిరిలో ధనలక్ష్మిగా ఆదిలక్ష్మి అమ్మవారు



బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడలో మహిషాసురమర్దినిగా కామాక్షితాయి



రాపూరు : పెంచలకోనలో ధనలక్ష్మిగా ఆదిలక్ష్మి



జయీభవ.. విజయీ భవ!

నేడు విజయదశమి • వివిధ అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవార్లు • భక్తులతో ఆలయాలు కిటకిట



రాజరాజేశ్వరి ఆలయంలో నృత్యం చేస్తున్న యువతులు

• కనువిందుగా రావణ సంహారం

నగరంలో శుక్రవారం రాత్రి రావణాసుర వధ కార్యక్రమం కనువిందు చేసింది. కరెంటాఫీసు వద్ద ఉన్న రాజరాజేశ్వరి ఆలయ సమీపంలో ట్రంకురోడ్డుపై జరిగిన ఈ వేడుకను వీక్షించేందుకు అశేష ప్రజానీకం తరలివచ్చింది. జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్ నామస్మరణలు మారుమోగాయి. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోదరులు, ఆయన మిత్రబృందం నిర్వహించింది. రావణ వధకు విల్లును కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి భక్తుల మధ్యలో ఊరేగింపుగా తీసుకువచ్చి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి అందించారు. అనంతరం జై శ్రీరామ్ నినాదంతో రావణ విగ్రహాన్ని దహన కార్యక్రమం ప్రారంభించారు. దాదాపు 10నిమిషాలపాటు విగ్రహంలో పొందుపరిచిన బాణాసంచా పేలుళ్లు కనువిందు చేశారు. డ్రోన్‌ల ద్వారా 27 పుణ్య నదులు జలాలను భక్తులపై సంప్రోక్షణ చేశారు. వచ్చే ఏడాది రావణ వధ వీఆర్సీ మైదానంలో ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ప్రకటించారు.

నెల్లూరు (సాంస్కృతికం) : దేశంలో విభిన్నమైన ప్రజలు, ఆచారాలు ఉన్నా దసరా పర్వదినాన్ని మాత్రం అందరూ కలిసి జరుపుకుంటారు. ఈ రోజు ఏ పని ప్రారంభించినా విజయం చేకూరుతుందని విశ్వసిస్తారు. అశ్వినీ మాసంలో మొదటి 9 రోజులను దేవీ శరన్నవరాత్రుల పేరుతో రోజుకో రూపంలో అమ్మవారిని కొలుస్తారు. దసరా పండుగ జరుపుకోవడానికి ఎన్నో పురాణ గాధలు, చరిత్ర ఉన్నాయి. విజయ దశమినే దసరా అని కూడా అంటారు. దుర్గాదేవి మహిషాసురుడితో 9 రాత్రులు యుద్ధం చేసి చివరకు వధించింది. ఈ సందర్భంగా పదవరోజు ప్రజలంతా పండుగను జరుపుకున్నారు. అదే విజయదశమి. అలాగే పాండవుల అజ్ఞాతవాసంలో తమ ఆయుధాలను శమీ వృక్షం (జమ్మి చెట్టు) పైనే దాచిపెట్టారు. ఆ సమయంలో విరాటుడి కొలువలో ఉన్న పాండవులు ఏడాది అజ్ఞాతవాసం పూర్తి కాగానే ఆ వృక్షాన్ని ప్రార్థించి తిరిగి ఆయుధాలను పొందుతారు. శమీ వృక్ష రూపంలో అపరాజితా దేవి ఆశీస్సులు పొంది కౌరవులపై విజయం సాధిస్తారు. రాముడు విజయదశమి నాడే అపరాజితా దేవిని పూజించి రావణుడిని సంహరించారు. శమీ పూజ దశమి రోజు ఎంతో ప్రత్యేకమైనది. నవరాత్రుల సమయంలో అమ్మవారు 9 రోజులపాటు రోజుకో రూపంలో దర్శనమిస్తారు. ఈ తొమ్మిది రోజులు రకరకాల నైవేద్యాలు అమ్మవారికి సమర్పిస్తారు విజయదశమి పండుగ, సంప్రదాయాలను కాపాడటానికి, ఆధ్యాత్మికతను పునరుద్ధరించడానికి, సమాజానికి సానుకూలతను అందించడంలో ముఖ్య ప్రాతను పోషిస్తుంది. జిల్లావ్యాప్తంగా అన్ని ఆలయాల్లో విజయదశమి పర్వదినం సందర్భంగా భారీ ఏర్పాట్లు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవార్లకు శనివారం రాత్రి వైభవంగా నగరోత్సవాలు జరగనున్నాయి.

• భగ్గుమన్న ధరలు

జిల్లాలో నిత్యావసర సరుకులతోపాటు పండ్లు, బొరుగులు, బెల్లం తదితర పూజా సామగ్రి ధరలు ఆకాశాన్ని అంటాయి. గుమ్మడికాయ ధర రూ.100 నుంచి 500 వరకు పలికింది. అరటి పిలకలు జత రూ.40, బొరుగులు కేజీ రూ.200, బెల్లం రూ.80, కిలో పూలు రూ.400 నుంచి 600 దాకా పలికింది. అలాగే పండ్ల ధరలు కూడా భగ్గుమన్నాయి. నిత్యావసర సరుకులు ధరలు రూ.10 నుంచి 20 వరకు పెరిగాయి. అయినా విజయాలకు నెలవైన విజయదశమి పండుగను ఉన్నంతలో తృప్తిగా జరుపుకునేందుకు ప్రజలు భారీగా కొనుగోలు చేస్తున్నారు.



పుణ్య నదులు జలాలను భక్తులపై చల్లుతున్న డ్రోన్





నెల్లూరు నగరంలో పూజాసామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు



సంగం : మహిషాసురమర్దినిగా కామాక్షిదేవి

చివరి రోజు వెల్లువలా!

- 'మద్యం' టెండర్ల ప్రక్రియ పూర్తి
- 182 షాపులకు 3900లకు మించి..
- ఒక్కో షాపునకు సుమారు 23
- ప్రభుత్వానికి రూ.78 కోట్లకుపైగా ఆదాయం

నెల్లూరు (క్రైం), అక్టోబరు 11: ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రధాన ఘట్టం ముగిసింది. జిల్లావ్యాప్తంగా 182 దుకాణాలకు 3900లకుపైగా దరఖాస్తులు అందాయి. ఆఫ్‌లైన్ లో శుక్రవారం సాయంత్రం 7 గంటల వరకుకు దరఖాస్తులు స్వీకరించడాన్ని అధికారులు నిలిపి వేశారు. అయితే ఆన్‌లైన్‌లో 7గంటల్లోపు ఎంట్రీ అయిన వ్యాపారులు అర్ధరాత్రి 12 గంటల వరకు దరఖాస్తులు దాఖలు చేశారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తే ఒక్కో షాపునకు సుమారు 23 దరఖాస్తులు దాఖలయ్యాయి. వీటి ద్వారా ప్రభు త్వానికి రూ.78 కోట్లకుపైగా ఆదాయం వచ్చింది. ఈ నెల 10వ తేదీ రాత్రికి 2,807 దరఖాస్తులు అందగా చివరి రోజు శుక్రవారం వెయ్యికిపైగా దరఖాస్తులు అందాయి. నెల్లూరులో ఒక్కో షాపునకు 20 నుంచి 30లోపు దరఖాస్తులు అందాయి.

• చివరి 4 రోజులు వేలల్లో...

ప్రైవేటు మద్యం దుకాణాలకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 1వ తేదీ నోటిఫికేషన్ విడుదల చేయగా 8వ తేదీ వరకు 182 షాపులకు వందల్లోనే దరఖాస్తులు అందాయి. అధికార పార్టీ నేతల కనుసైగల్లో షాపులకు దరఖాస్తులు తక్కువగా దాఖలు అవుతున్నాయని ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించింది. దీంతో మంత్రులు, నాయకులు జోక్యం ఉండకూడదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గట్టిగా చెప్పడంతో అప్పటి నుంచి దరఖాస్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఈ నెల 8 నుంచి 11వ తేదీ లోపు 3వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.78 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. ఈ నెల 12, 13 తేదీల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు దర ఖాస్తుల పరిశీలన చేసి 14వ తేది ఉదయం నగరం లోని కస్తూర్బా కళాక్షేత్రంలో లాటరీ విధానంలో వ్యాపారులకు లైసెన్సులు అందిస్తారు. 16 నుంచి వ్యాపారులు షాపులను ప్రారంభించుకోవచ్చు.

• లింగసముద్రంలో అత్యధికం

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేం దుకు వీలుగా షాపుల వారీగా నెంబర్లు కేటాయిం చారు. నెల్లూరు కార్పొరేషన్‌లో 30 షాపులకు ఎన్‌ఎల్‌ఆర్/1 నుంచి 30 వరకు నెంబర్లు కేటా యించారు. జిల్లావ్యాప్తంగా ఎన్‌ఎల్‌ఆర్/1 నుంచి ఎన్‌ఎల్‌ఆర్/182 వరకు నెంబర్లు కేటాయించారు. అత్యధికంగా లింగసముద్రం మండల పరిధిలోని 175వ నెంబరు షాపునకు 38, 176 షాపునకు 34, సైదాపురం మండల పరిధిలోని 162 షాపునకు 36, కలు వాయి మండలంలోని 144 షాపునకు 36, చేజర్ల మండలంలోని 155 షాపునకు 35 అత్యధికంగా దరఖాస్తులు అందాయి. ఆత్మ కూరు రూరల్‌లో 140, 141 షాపులకు 9 చొప్పున, కొండాపు రంలోని 116 షాపునకు 9, 117 షాపుకు 11, అల్లూరు రూరల్ పరిధిలో 64, 65 షాపులకు 11 చొప్పున, వలేటివారిపాలెంలోని 181, 182 షాపులకు 11 చొప్పున, ఉదయగిరి మండలంలోని 95 షాపుకు 11 అత్యల్పంగా దరఖాస్తులు అందాయి. బుచ్చి సర్కిల్ పరిధిలో 14 షాపులకు 258 దరఖాస్తులు అందాయి.


18 నే
విడుదల
విజయదశమి
శుభాకాంక్షలతో
PRAVEEN JETTI Film
కన్నకాంపౌండ్
1995
PRAVEEN JETTI
Smt HARIKA JETTI, BURRA MALLESH GOUD (BOTTU), Smt PITLA VIJAYA LAKSHMI
DOP ARE SANDEEP MUSIC SAI SRINIVAS EDITING PANDU
DANCE KARIA NANDA, MAHESH FIGHTS VIOLENT VELU
SUCHIN CINEMAS LLP


A FILM BY
KALYAN CHAKRAVARTHY
దసరా శుభాకాంక్షలు
FROM TEAM REWIND
IN THEATERS
OCTOBER
18
రివైండ్
SCREENPLAY, DIALOGUES, PRODUCER & DIRECTOR KALYAN CHAKRAVARTHY
MUSIC ASHIRVAD DOP SHIVARAM CHARAN ACTION DIRECTOR NATRAJ CHOREOGRAPHY RAJ KRISHNA STORY BHARAT CHOUDARY
LYRICS RAVI VARMA AKULA EDITOR THUSHARA PALA SFX ETHIRAJ FINAL MIX RAMA NAIDU STUDIOS DI RAJU REDDY PRO MADHU


DARK
HISTORY LEADS TO
DEADLY
MYSTERY
OCT 18TH RELEASING IN
THEATERS
దసరా
శుభాకాంక్షలు
వీక్షణం
THE OBSERVER IS OBSERVED


SUBISHI ENTERTAINMENTS
ASIAN SURESH
దసరా
శుభాకాంక్షలు
లగ్గం
THE CRAZIEST WEDDING EVER
WRITTEN & DIRECTED BY
RAMESH CHEPPALA
PRODUCED BY
VENUGOPAL REDDY
WORLDWIDE RELEASE
OCTOBER
25
IN THEATERS
MN BAL REDDY
MANISHARMA
CHARAN ARJUN
BONTHALA NAGESWARA REDDY
KRISHNA ARTS
G. KRISHNNA
SRIDHAR
AJAY SIVA SANKAR
VIVAREDDY POSTERS


SMT. CHINTA VARALAXMI PRESENTS
KA PRODUCTIONS
దసరా
శుభాకాంక్షలు
SCAN THE QR CODE
TO WATCH TEASER
KIRAN ABBAVARAAM
క


SRI VEDAKSHARA MOVIES
విజయ దశమి శుభాకాంక్షలు
RANGAPURAM RAGHAVENDRA
MURALI KRISHNA CHINTALAPATI
COMING SOON
శ్రీ శ్రీ శ్రీ
రాజావారు
WRITTEN & DIRECTED BY VEGESNA SATISH
PRODUCED BY CHINTHAPALLI RAMARAO


దసరా
శుభాకాంక్షలు
హరుడు
THE DESTROYER
DR. LAKSHMANA RAO DIKKALA , DR. PRAVEEN REDDY


GUNA HANDMADE FILMS
SMT. RAGINI GUNA PRESENTS
EARLY 2025
euphoria
A GUNASEKHAR FILM
SCAN FOR
GLIMPSE
దసరా
శుభాకాంక్షలు
PRODUCED BY NEELIMA GUNA
KAALA BHAIRAVA PRAVEEN K POTHAN


people MEDIA FACTORY
CHITRALAYAM STUDIOS
DONEPUDI CHAKRAPANI PRESENTS
మన కుటుంబం మొత్తం 'విశ్వం'
చిత్రం చూస్తూ కడుపుబ్బా నవ్వుతూ సంతోషంగా
"దసరా" పండగ చేసుకుందాం
ALL INDIA RELEASE BY
SRI TIRUMALA TIRUPATI VENKATESWARA FILMS
MACHO STAR GOPICHAND IN
విశ్వం
A SREENU VAITLA FILM
T G VISHWA PRASAD VENU DONEPUDI
VIVEK KUCHIBHOTLA KONDAL JINNA KRITHI PRASAD K.V. GUHAN
CHAITAN BHARADWAJ GOPI MOHAN BHANU - NANDU PRAVEEN VARMA AMAR REDDY KUDUMULA KIRAN KUMAR MANNE
RAVI VERMA KOLLI SUJITH KUMAR ADITYA CHEMBOLU KONGARAPI RAMBABU VAMSI SHEKAR
TIPS TELUGU

మహమ్మదాపురం పంపింగ్ స్టేషన్‌కు
యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

● మంత్రి పొంగూరు నారాయణ


మహమ్మదాపురం వద్దమెగా వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

పొదలకూరు, అక్టోబరు 11: నెల్లూరు నగర ప్రజలకు తాగు నీటిని అందించే మహ మ్మదాపురం పంపింగ్ స్టేషన్‌కు యుద్ధ ప్రాతి పదికన మరమ్మ తులు చేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభి వృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. భారీ వర్షం ఈదురు గాలులకు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్న పొదలకూరు మండలం మహమ్మదాపురం తాగునీటి సరఫరా కేంద్రాన్ని మంత్రి నారాయణ శుక్రవారం సందర్శించారు. మెగా వాటర్ ప్లాంట్ మొత్తాన్ని కలియతిరిగి దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్ల మరమ్మతు గురించి పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ మోహన్‌ను వివరాలడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి మెగా ప్రాజెక్టు డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి పనితీరు మార్చుకోవాలంటూ హెచ్చరించి, యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పూర్తిచేసి నెల్లూరు నగరానికి వెంటనే మంచినీరు అందించే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ నెల్లూరు నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తామన్నారు. అదేవిధంగా ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్‌తో నిధులు మంజూరు చేయించి, అమృత్ పథకం ద్వారా రాష్ట్రంలోని 120 మున్సిపాలిటీలలో నిరంతర తాగునీటి సౌకర్యం కల్పించేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నామన్నారు. రాబోవు రెండు సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి బాట పట్టిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ మోహన్, నారాయణ విద్యా సంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి, మెగా వాటర్ ప్రాజెక్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు

● జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తిన కార్తీక్


నూనె ప్యాకెట్ అందజేస్తున్న జేసీ కార్తీక్, వేమిరెడ్డి

నెల్లూరు (వ్యవసాయం), అక్టోబరు 11: నిత్యావసరాల ధరలు నియంత్రణకు ప్రభు త్వం చర్యలు చేపట్టిందని జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తిన కార్తీక్ తెలిపారు. నగరంలోని నవాబుపేట రైతు బజారులో వినియోగ దారులకు తక్కువ ధరకు వంట నూనెలు అందించే కౌంటర్‌ను శుక్రవారం రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డితో కలిసి జాయింట్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన బీపీటీ రకం బియ్యం, కందిపప్పు, పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ తక్కువ ధరకు అందించేందుకు జిల్లాలో 18 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా కందిపప్పు కేజీ రూ.150, బీపీటీ రకం స్టీమ్‌బియ్యం కేజీ రూ.45, రా బియ్యం కేజీ రూ.47, పామాయిల్ లీటర్ రూ.110, సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటరు రూ.124 విక్రయిస్తున్నామన్నారు. ఒక్కో రేషన్ కార్డుపై 3 లీటర్ల పామాయిల్, ఒక లీటరు సన్‌ఫ్లవర్ ఆయిల్, అందిస్తామన్నారు. టమోటాలు కేజీ రూ.42, ఉల్లిపాయలు కేజీ రూ.32కు అందిస్తున్నామన్నారు. రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పౌర సరఫరాల వ్యవస్థను పటిష్ఠం చేసి ప్రజలకు నిత్యవసరాలను సరసమైన ధరకు అందించేందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, పౌరసరఫరాల శాఖ మంత్రి సమష్టి కృషి చేస్తున్నారన్నారు. రేషన్ షాపులను పటిష్ఠం చేసి, బహిరంగ మార్కెట్లో ధరలను నియంత్రించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో వెంకటరమణ, మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత, తదితరులు పాల్గొన్నారు.

తెల్లరాయి తరలిస్తున్న టిప్పర్ స్వాధీనం


పోలీసుల అదుపులో ఉన్న టిప్పర్

సైదాపురం, అక్టోబరు 11: అక్రమంగా తెల్లరాయి తరలిస్తున్న టిప్పర్‌ను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సర్కిల్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ కాంతికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా తెల్లరాయి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా తెల్లరాయి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కుక్క కాటుతో మహిళకు తీవ్ర గాయాలు

అనంతసాగరం, అక్టోబరు 11: మండలంలోని లింగంగుంటకు చెందిన రెడ్డిమళ్ల లక్ష్మమ్మపై శుక్రవారం ఉదయం కుక్క దాడిచేసి కరవడంతో ఆమెకు తీవ్ర గాయమైంది. కుటుంబసభ్యులు స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించి ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు.

గంజాయి విక్రేత అరెస్టు

కోవూరు, అక్టోబరు 11: జిల్లాలోని పలు ప్రాంతాల్లో గంజాయిని విక్రయిస్తున్న ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఇమామ్ హుస్సేన్‌ను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయమై సీఐ సుధాకర్‌రెడ్డి స్థానిక సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను తెలిపారు. పడుగుపాడు రైల్వేస్టేషన్ సమీపంలో 10కిలోల గంజాయిని మోటార్‌బైక్‌లో తీసుకువెళ్తున్న సమాచారం మేరకు కోవూరు ఎస్‌ఐ రంగనాథ్ గౌడ్ సిబ్బందితో ముందస్తుగా కాపు కాచి నిందితుడితో పాటు గంజాయిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రంగనాథ్ గౌడ్, పోలీసులు సునీల్‌కుమార్, రషీద్‌లను ఆయన అభినందించారు.

మాజీ హోంగార్డు అరెస్టు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 11: సీఐ ఐడీ పార్టీ కానిస్టేబుల్‌నంటూ వైద్యుడిని బెదిరించడమే కాకుండా నగదు డిమాండ్ చేసిన మాజీ హోంగార్డును బాలాజీనగర్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం అంబాపురంకు చెందిన రియాజ్ పోలీసుశాఖలో గతంలో హోంగార్డుగా పనిచేశారు. ఆయన ఈనెల 8వ తేది రాత్రి అపోలో వైద్యశాల జంక్షన్ వద్ద బైక్‌పై ఇంటికి వెళుతున్న వైద్యుడు విశ్వనాథ్‌ను అడ్డగించి నగదు బెదిరించడమే కాకుండా నగదు డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడుని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు బాలాజీనగర్ పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి

కొవ్వూరు, అక్టోబరు 11: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఒక వృద్ధురాలు మృతి చెందినట్లు తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు ఎస్‌ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. నెల్లూరు జిల్లా ఇందుకూరుపేటకు చెందిన పులి కాటయ్య అతని భార్యలు అనంతమ్మ (73), సుబ్బమ్మలు కొంతకాలం క్రితం కొవ్వూరు వచ్చేశారు. ఫినాయిల్ అమ్ముకుంటూ కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి టోల్‌గేటు వద్ద నివాసం ఉంటున్నారు. కొంత కాలం క్రితం కాటయ్య మృతి చెందాడు. శుక్రవారం అనంతమ్మ(73) రాజమహేంద్రవరం ఆసుపత్రికి వెళ్లడానికి టోల్‌గేటు సెంటర్‌లో రోడ్డు ప్రక్క నిల్చుంది. నిడదవోలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాజమహేంద్రవరం నుంచి నిడదవోలు వెళుతూ టోల్‌గేటు వద్ద నిల్చున్న అనంతమ్మను ఢీకొట్టగా తీవ్రంగా గాయపడింది. సమాచారం తెలిసిన వెంటనే కొవ్వూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన అనంతమ్మను కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ధృవీకరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతురాలికి వరుసకు చెల్లెలు అయిన సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు ఎస్‌ఐ జగన్మోహనరావు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	136
లేయర్ లైవ్	118
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	268
లేయర్	200

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7303
వెండి కిలో ధర	రూ. 92,500
వెండి ఒక గ్రాము	రూ. 95.50

జగన్ మహిషాసురుడి కంటే ప్రమాదం

● మంత్రి నారాయణతోనే నెల్లూరు నగరాభివృద్ధి సాధ్యం
● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి


మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 11 : జగన్మోహన్‌రెడ్డి మహిషాసురుడు కంటే ప్రమాదకరమని, ఆయన ఓడిన తర్వాత ఏపీకి మంచి రోజులు వచ్చాయని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు వైసీపీకి 11 సీట్లు ఇచ్చినా జగన్మోహన్‌రెడ్డికి ఇంకా బుద్ధి రాలేదంటూ మండిపడ్డారు. ప్రజలు మరచి పోతారన్న ఉద్దేశంతో జగన్ ప్రభుత్వం మీద అవినీతి ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని మాజీ సీఎం జగన్ విధ్వంసం చేసి పోతే కేవలం 4 నెలల్లో టీడీపీ అధినేత చంద్రబాబు గాడిలో పెడుతున్నారని అన్నారు. బాడ్ బాయ్ గుడ్ బుక్ ఎలా రాస్తాడని ఎద్దేవా చేశా రు. జగన్ దెబ్బకు పరారైన కంపెనీలు చంద్రబాబు సమర్థతను చూసి తిరిగి వస్తున్నాయని చెప్పారు. రూ.60 వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయని వెల్లడించారు. రాబోయే ఐదేళ్లలో 25 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా చం ద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటి కైనా చేతగాని దద్దమ్మ మాటలు జగన్ మానుకోవాలని హితవు పలికారు. పార్కులను తానే అభివృద్ధి చేశామని మాజీ మంత్రి అనిల్‌కుమార్ మాట్లాడటం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. నెల్లూరు నగరంలో ఇప్పటికే అండర్‌గ్రౌండ్ పనులు ప్రారంభమయ్యాయని, తాను నుడా చైర్మన్‌గా ఉన్న సమయంలో మంత్రి నారాయణతో కలిసి ఎన్నో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. ఇప్పుడు కూడా నారాయణ సారథ్యంలో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరప్రసాద్, పిట్టి సత్యనారాయణ, కప్పిర శ్రీనివాసులు, ప్రశాంత్, జాకీర్, మొయినుద్దీన్, రేవతి పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

● జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్


భేటీ బచావో, భేటీ పడావో అన్న ప్లకార్డులను ప్రదర్శిస్తున్న అధికారులు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 11 : మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జరిగింది. డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా డీసీపీవో సురేష్ మాట్లాడుతూ కన్యాశుల్కం, బాల్య వివాహం, జోగి వ్యవస్థ, మాతంగి కన్యలు వంటి వ్యవస్థను అధిగమించినా సాం ఘికంగా, ఆర్థికంగా, లైంగికంగా మహిళలు, బాలికలు అణచివేతకు గురవుతూనే ఉన్నార న్నారు. అయితే ఇన్ఫోసిస్ డైరెక్టర్ సుధామూర్తి, పాకిస్తాన్‌లో మలాల, దివంగత ప్రధాని ఇందిరాగాంధీ, సిరిమావో బండారు నాయక్, ఖలీదా జియా, బెనజీర్ భుట్టో వంటి మహిళలు వివక్షతకు గురై ఉన్నత శిఖరాలకు అధిగమించారన్నారు. సీడీపీవో లక్ష్మీదేవి మాట్లాడుతూ 'భవిష్యత్తులో బాలికల కోసం' అనే నినాదంతో ముందుకు వెళుతున్నామన్నారు. మహిళల అభ్యున్నతి కోసం కంకణం కట్టుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం భేటీ బచావో.. భేటీ పడావో అన్న నినాదంతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో దిశా సీఐ కృష్ణారెడ్డి, ఐటీడీఏ ఏఎల్‌వో శాంతి, గర్ల్ చైల్డ్ అధికారి మమత, దిశా ఏఎస్‌ఐ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు చైల్డ్ ఆశ్రమానికి బాలల అప్పగింత


ఇద్దరు బాలలను చైల్డ్ వెల్ఫేర్ ఆశ్రమానికి అప్పగిస్తున్న పోలీసులు

సంగం, అక్టో బరు 11: బాతుల యజమాని పెట్టే బాధలు భరించలేక పరారైన బాలలను చేరదీసిన పోలీసులు గురువారం వారిని అల్లూరులోని చైల్డ్ ఆశ్రమానికి అప్పగించారు. పోలీసుల వివరాల మేరకు.. గుడ్లూరు మండలానికి చెందిన సుశీలమ్మ, బోడెయ్యలు తమ బాతులు మేపేందుకు దగదర్తి మండలం కాంట్రాయపాడుకు చెందిన ఏలూరు చెంచయ్య, చెంచమ్మ పిల్లలు భవానీ, దుర్గ అనే ఇద్దరు మైనర్ బాలురను ఐదేళ్ల కిందట జీతానికి తీసుకు వచ్చారు. అటు జీతం ఇవ్వకపోవడంతో పాటు బాతుల వద్ద సక్రమంగా కాపలా ఉండడం లేదని వేధిస్తున్నారు. ఈక్రమంలో వారు బాధలు భరించలేక యజమానికి తెలియకుండా తల్లిదండ్రుల వద్దకు వెళ్లే క్రమంలో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో బాతుల యజమాని నిర్వాకం వెలుగుచూసింది. ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు డీసీపీవో సురేష్, సీడీపీవో సునీలత, వీఆర్వో స్థానిక పోలీస్‌స్టేషన్‌కు విచ్చేసి బాలలు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారి సమక్షంలోనే అల్లూరులోని చైల్డ్ ఆశ్రమానికి అప్పగించారు. అనంతరం చైల్డ్ యాక్ట్ ప్రకారం బాతుల యజమానిపై కేసు నమోదు చేశారు.

కాంట్రాక్ట్ లెక్చరర్స్‌ను రెగ్యులర్ చేయాలి

● మంత్రి నారా లోకేష్‌కు జేఏసీ వినతి


నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నేతలు

నెల్లూరు (విద్య), అక్టోబరు 11: ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన కాంట్రాక్ట్ లెక్చరర్ల రెగ్యులైజేషన్ ప్రక్రియను తిరిగి కొనసాగించి రాష్ట్రంలోని 3,618 మందిని రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ నేతలు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఉండవల్లిలో మంత్రికి వినతిపత్రం అందచేసి మాట్లా డారు. జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పనిచేసే నాన్ టీచింగ్ క్యాడర్ నుంచి ఒకేషనల్ జూనియర్ లెక్చరర్ 25 శాతం కోటా ప్రమోషన్స్ విషయంలో ప్రస్తుతం పనిచేసే వారిని మినహాయించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎలాంటి భద్రత, బెనిఫిట్స్ లేకుండా పనిచేస్తున్న లెక్చరర్స్ సర్వీస్‌ను 62 ఏళ్లకు పొడిగించాలన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో 11 నెలలు మాత్రమే జీతాన్ని అందించారని, మే నెలలో పనిచేసినా కోల్పో యిన జీతాన్ని ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర చైర్మన్ కుమ్మరకుంట సురేష్, కోచైర్మన్ కల్లూరి శ్రీనివాస్, వైస్ చైర్మన్ బి.వీరయ్య, నాయకులు ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

● రూ.3 లక్షల నగదు, 15 సవర్ల నగలు అపహరణ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సుమన్

కలువాయి, అక్టోబరు 11 : ఓ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ జరిగిన సంఘటన స్థానిక మాజీ సర్పంచు గుడిగుంట శ్రీనివాసులు వీధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కలువాయికి చెందిన యడ్ల సురేష్‌కుమార్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఆయన భార్య స్వరాజ్యలక్ష్మీ న్యాయవాది. హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న వీరి కుమారుడు విజయవాడ నుంచి నెల్లూరుకు వచ్చి ఉంటున్నారు. ఈనెల 7వ తేదీన సురేష్‌కుమార్ కుటుంబం ఇంటికి తాళం వేసుకుని నెల్లూరులోని కుమారుడి వద్దకు వెళ్లారు. కాగా, శుక్రవారం రాత్రి కలువాయిలో ఓ వివాహ కార్యక్రమం ఉండటంతో సురేష్‌కుమార్ ఒక్కడే కలువాయికి వచ్చి ఇంటికి వెళ్లి చూడగా ప్రధాన ద్వారం పగలగొట్టి ఉంది. దీంతో ఇంట్లో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ సుమన్ పరిశీలించారు. ఇంటికి తాళం వేసి ఉండటంతో ఇంట్లో ఎవ్వరూ లేరన్న విషయాన్ని గుర్తించిన దుండగులు ఈ చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. క్లూస్‌టీం సిబ్బంది వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాటి అజమాయిషీలోనే ఆలయాల్లో కార్యకలాపాలు
పాలకులు, అధికారుల పెత్తనానికి ఇక చెల్లు
జిల్లాలోని 200 దేవాలయాల్లో కమిటీల ఏర్పాటు


నెల్లూరు తల్పగిరి రంగనాథస్వామి ఆలయం

వైదిక కమిటీల మాటే వేదం

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 11: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని ఆలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ కూటమి ప్రభుత్వం జీవో జారీ చేసింది. గత వైసీపీ హయాంలో దేవాలయాల్లో కల్యాణో త్సవాలు, హోమాలు, యాగాలు, కుంభాభిషేకాలు, ఇతర సేవల నిర్వహణలో రాజకీయ నేతలతోపాటు ఈవో స్థాయి నుంచి కమిషనర్ వరకు జోక్యం ఉండేది. దీంతో ఆ ఐదేళ్లలో ఆలయాలన్నీ పూర్వవైభవం కోల్పోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆలయాలకు పూర్వ వైభవం తెస్తా మన్న నేతల హామీ నేడు నెరవేరింది.

జిల్లాలో 1203 నోటిఫైడ్ ఆలయాలు ఉన్నాయి. ఇందులో కమిషనర్ పరిధిలో మాలకొండ, పెంచల కోన, వేణు గోపాల స్వామి, రాజరాజేశ్వరి, జొన్నవాడ కామాక్షితాయి ,తల్పగిరి రంగనాథ స్వామి, నర్రవాడ వెంగమాంబ ఆలయాలు ఉన్నాయి. డిప్యూటీ కమిషనర్ పరిధిలో 52 ఆలయాలు, జిల్లా సహాయ కమిషనర్ పరిధిలో సుమారు 113 ఆలయాలకుపైగా ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చిన జీవోతో సుమారు 200 ఆలయాల్లో పాలకులు, అధికారుల పెత్తనానికి చెక్ పడినట్టే. ఇక నుంచి ఆలయాల సంప్రదాయాలు, వైదిక, ఆగమ వ్యవహారాల్లో ఈవో నుంచి కమిషనర్ స్థాయి అధికారులెవరూ జోక్యం చేసుకోరాదు. ప్రభుత్వం జీవో ప్రకారం ప్రతీ ఆలయంలోనూ వైదిక కమిటీని ఏర్పాటు చేస్తారు. ఆ కమిటీ సూచనలను రాష్ట్ర దేవదాయ కమిషనర్ నుంచి ఈవో స్థాయి అధికారులు పాటించాలి. ఆలయాల్లో వివిధ సేవా టికెట్ల ధరలు, నిర్ణయం ఇక నుంచి వైదిక కమిటీలదే. అలాగే కల్యాణోత్సవ ముహూర్తాలు, యాగాలు, కుంభాభిషేకాలు, కొత్త పూజల ప్రారంభం వంటి అంశాలలో వైదిక కమిటీ లేదా ప్రధాన అర్చకుడి సూచనలు పాటించాలి. 6ఏ (రాష్ట్ర కమిషనర్ పరిధి) ఆలయాల్లో తక్షణం వైదిక ఆగమ కమిటీలను ఏర్పాటు చేయాలి.

త్వరలో కమిటీల ఏర్పాటు

ఆలయాలకు స్వయంప్రతిపత్తిపై జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్ రెడ్డిని వివరణ కోరగా, ఇప్పటికే ప్రభుత్వం జీవో విడుదల చేసిందని తెలిపారు. కమిషనర్ నుంచి ఇంకా ఎలాంటి సూచనలు అందలేదన్నారు. కమిషనర్ సూచనల మేరకు జిల్లాలోని ఆలయాల్లో వైదిక, ఆగమ కమిటీలను నియమిస్తామని పేర్కొన్నారు.

పీకేపాడు అటవీ ప్రాంతంలో చిరుత?

అనంతసాగరం, అక్టోబరు 11: మండలంలోని పడమటికంబంపాడు అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు శుక్రవారం పుకార్లు చెలరేగాయి. ధర్మపల్లెమ్మ గుడి సమీపంలో చిరుత వేలిముద్రలు, ఆనవాళ్లు గొర్రెలకాపరులు గుర్తించారని సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈవిషయంపై అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

సోమశిలలో 52.350 టీఎంసీల నీరు నిల్వ

అనంత సాగరం, అక్టోబరు 11: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శుక్రవారం 7,100 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 52.350 టీఎంసీలుగా నమోదైంది. దిగువ డెల్టాకు 2,000, కండలేరుకు 8,500, ఉత్తర కాలువకు 540, దక్షిణ కాలువకు 5 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

దసరా.. విజయానికి ప్రతీక : కలెక్టర్

నెల్లూరు (సాంస్కృతికం) : విజయదశమి అంటే విజయానికి ప్రతీక అని, జిల్లావాసులందరికీ ఈ విజయదశమి సరికొత్త విజయాలు అందించాలని కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అన్ని వర్గాల ప్రజలకు చేరవేస్తూ, అన్ని రంగాల్లో జిల్లాను ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు జిల్లా ప్రజలపై పుష్కలంగా ఉండి అందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అలాగే జాయింట్ కలెక్టర్ కార్తీక్ కూడా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

● **నెల్లూరు(హరనాథపురం) :** విజయదశమి పర్వదినం సందర్భంగా ప్రతి ఇంట్లో సుఖశాంతులు వెల్లివిరియాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు ప్రకటనలో ఆకాంక్షించారు. దసరా సందర్భంగా వారు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలన్నారు.


రథంపై శ్రీవారి చిద్విలాసం

కమనీయం శ్రీవారి రథోత్సవం

కావలి టౌన్, అక్టోబరు 11: స్థానిక బృందావనం కాలనీ వెంకటేశ్వర స్వామికి శుక్రవారం ఉదయం భక్తులు రథోత్సవం నిర్వహించారు. రాత్రి అశ్వవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. టీటీడీ అర్చక బృందంతో చేపట్టిన ఉత్సవాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరామ్ మాల్యాద్రి పర్యవేక్షించారు. రథోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు, మహిళల కోలాటాలతో ప్రాంగణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

ఆర్టీవో అధికారుల తనిఖీలు

కావలి రూరల్, అక్టోబరు 11: స్థానిక ముసునూరు టోల్ గేట్ వద్ద గురువారం అర్ధరాత్రి నుండి శుక్రవారం ఉదయం వరకు ఆర్టీవో అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బి.చందర్ ఆదేశాల మేరకు సరుకులతో హైదరాబాద్‌కు వెళ్తున్న 5బస్సులను గుర్తించి కేసులు నమోదు చేసినట్లు కావలి ఎంవీఐ సుందర్‌రావు తెలిపారు. ప్రయాణికులతో పాటు సరుకులు రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కావలి ఎంవీఐ సుందర్‌రావు, జిల్లా స్క్వాడ్ ఎంవీఐ గోపీనాయక్ పాల్గొన్నారు.

దుర్వాసనతో జనం అవస్థ



నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 11 : మద్రాసు బస్టాండు సెంటర్‌లో అన్న క్యాంటీన్ వద్ద శుక్రవారం డ్రైనేజీ నీరు పొంగి రోడ్డుమీద ప్రవహించింది. ఆ డ్రైనేజీ మురుగు వల్ల కోనేటి మార్కెట్, ఏసీ మార్కెట్‌కి వచ్చే జనం, వ్యాపారులు దుర్వాసనతో అవస్థలు పడ్డారు. తరచూ ఇలా డ్రైనేజీ పొంగి ఇబ్బందులు పడుతున్నామని, వ్యాపారులు వాపోతున్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి



Before the Honourable Deputy Registrar of Chits (O/o District Registar), At Kadapa

Dispute No. DRK/CF No.206/2023

Between

M/s. Shriram Raghavendra Chits Pvt. Ltd., Kadapa Branch ... Disputant

Vs

Shaik Babavalli and Others ... Opponents

Opponent No. OP2కు నోటీసు

Opponent No.2 :- Mr. Shaik Mahammad Vali S/o Shaik Chinna Masthan, aged about 30 years, is working as Sales Manager, SBI Life Insurance Nellore, SPSR Nellore District and is Residing at Mixed Colony, Jammalapalem, Nellore, SPSR Nellore District, Andhra Pradesh.

డిస్పూటెంట్ డిస్పూట్ బాకీ మొత్తం **రూ.8,93,780/-లు** రాబట్టుకొనుటకు గాను మీపై దాఖలు వేసిన డిస్పూట్ అపోనెంటు **OP2** అయిన మీరు **6/11/2024వ తేదిన** హాజరగుటకుగాను వాయిదా వున్నది. పై దినము 11.00 గం.లకు డిప్యూటి రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, O/o. ది డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, బుద్ద టౌన్‌షిప్ దగ్గర, కడప వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలుపుకోనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.

(By order of)

The Hon'ble Deputy Registrar of Chits/ Arbitrator.
Dist. Registrar and Stamps Department,
Near Budda Township, Kadapa.













ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ రుణాలకు దరఖాస్తు గడువు పెంపు

సీతారామపురం, అక్టోబరు 11: విభిన్న ప్రతిభావంతులకు మంజూరుచేసే ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ రుణాలకు సంబంధించి దరఖాస్తు గడువును వచ్చే నెల 1వ తేదీ వరకు పొడిగించినట్లు నియోజకవర్గ దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆదోని రమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆదోని రమణయ్య శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 7వ తేదీతో దరఖాస్తు గడువు ముగియగా, సుదూర ప్రాంతాల దివ్యాంగులను దృష్టిలో ఉంచుకుని గడువు పొడిగించాలని కోరడంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించి గడువు పెంచారని తెలిపారు. ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, మర్రిపాడు మండలాల దివ్యాంగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.







పాడిరైతులకు బిందెల అందజేత

చిట్రగుంట, అక్టోబరు 11: బోగోలు మేజర్ పంచాయతీలోని సహకార పాల సరఫరా సంఘం కేంద్రంలో అధ్యక్షుడు దొడ్ల అంజయ్య యాదవ్ తన సొంత నిధులతో శుక్రవారం 47మంది పాల ఉత్పత్తి దారులకు స్టీల్ బిందెలను అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, పాల త్పత్తిదారులు ఉన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

కావలి, అక్టోబరు 11: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని సంయుక్త సేవా సంస్థ బాధ్యులు గంగపట్ల సురేంద్ర, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రఘురామిరెడ్డి తెలిపారు. స్థానిక బాపూజీనగర్ మున్సిపల్ పార్కు ఆవరణలో శుక్రవారం ఆ సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటి మాట్లాడారు. గత ఏడాది 1600 మొక్కలు నాటామని ఈ ఏడాది పూలు, పండ్లు, ప్రజలకు నీడనిచ్చే 2వేల మొక్కలను నాటడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, జానకిరాం పాల్గొన్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా

చిట్రగుంట, అక్టోబరు 11: ఎస్వీ పాలెం నుంచి బోగోలుకు వెళ్లే ఆటో శుక్రవారం ఉమామహేశ్వరపురం సమీపంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డుపై బోల్తా పడింది. రోడ్డు సమీపంలో తవ్విన కాలువలో దిగడం వలన ఆటో అదుపు తప్పి ముందు వెలుతున్న కారును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. కొన్ని నెలల కిందట పైపులైన్ ఏర్పాటు కోసం గుత్తేదారులు రోడ్డు తవ్వి సక్రమంగా పూడ్చకపోవడం వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఇసుక రీచ్ ఏర్పాటుకు పరిశీలన

అనంతసాగరం, అక్టోబరు 11: మండలంలోని పడమటి కంబంపాడులో ఇసుక రీచ్ ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. శుక్రవారం ఆత్మకూరు ఆర్డీవో పావని, మైనింగ్ అధికారులు ఇసుక నిల్వచేసేందుకు స్థల పరిశీలన చేశారు. త్వరలో ఇసుక రవాణా జరిగే అవకాశం ఉంది.



బౌద్ధధర్మ దీక్షకు తరలిరండి

అల్లూరు, అక్టోబరు 11: బౌద్ధధర్మ దీక్షకు అంబేద్కర్ అభిమానులు భారీగా తరలిరావాలని భీమ్ ఆర్మీ తెలంగాణ సోషల్ మీడియా కన్వీనర్ పొంగులూరు ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక పాతబస్టాండు కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం దళితులు చేపట్టిన ప్రదర్శన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శనివారం నెల్లూరు గాంధీబొమ్మ సెంటరు నుండి వీఆర్సీ సెంటరులోని అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించే దమ్మ ర్యాలీలో పాల్గొనాలన్నారు. ఉదయం 10గంటలకు స్వతంత్ర పార్కు వద్దకు చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు, సమతా సైనిక జిల్లా అధ్యక్షులు నేతగాని విమల్ అన్న, శనగల అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయి భక్తుల భిక్షాటన

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 11 : షిరిడీ సాయిబాబా 106వ మహా సమాధి ఆరాధన మహోత్సవాల సందర్భంగా బాలాజీనగర్ పద్మావతి నగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరం ఆధ్వర్యంలో శుక్రవారం భిక్షాటన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. సాయిదర్బార్ అధ్యక్షుడు మధుసాయి ఆధ్వర్యంలో సాయి భక్తులు ఇంటింటికి తిరిగి భిక్షాటన చేశారు. 12 నుంచి మందిరంలో ఆరాధనోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ఎన్‌సీసీ కేర్ టేకింగ్ అధికారికి లెఫ్టినెంట్ హోదా

వింజమూరు, అక్టోబరు 11: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేర్ టేకింగ్ అధికారి న్యామతుల్లాకి లెఫ్టినెంట్ హోదా దక్కినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుజాత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మహారాష్ట్రలోని నాగ్ పూర్‌లో ఎన్‌సీసీ ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమిలో 75రోజులు శిక్షణ పొంది, అక్కడ నిర్వహించిన పరీక్షల్లో న్యామతుల్లా ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు.





కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 11: బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ యువశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కెనరా బ్యాంకులో ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం ఎస్‌బీవై, పీఎం జేజేబీవై, అటల్ పింఛన్‌యోజన, సుకన్య సమృద్ధియోజన తదితర పథకా లపై అవగాహన కల్పించారు.





ఆక్రమణల చెరలో పాతూరు చెరువు
● సోమశిల జలాలు చేరక రైతుల అవస్థలు

వింజమూరు, అక్టోబరు 11: పట్టణంలోని బంగ్లా సెంటర్ సమీపంలో ఉన్న పాతూరు చెరువు ఆక్రమణకు గురవుతోంది. ముఖ్యంగా పట్టణ సమీపంలో ఉన్న చెరువు కావడంతో దీనిపై ఆక్రమణదారుల కన్నుపడింది. పట్టణం రోజురోజుకు విస్తరిస్తూ అభివృద్ధి చెందడంతో పలు గ్రామాల నుంచి పట్టణానికి వలస వస్తున్న ప్రజలు ఖాళీగా ఉన్న చెరువులు, వాగుల్లో పాగా వేస్తున్నారు. దీంతో చెరువు నీరు వచ్చే దారి లేకుండా పోయింది. గతంలో టీడీపీ ప్రభుత్వంలో చెరువును సమ్మర్ స్టోరేజీగా ప్రభుత్వం గుర్తించి సోమశిల జలాలను అందించే విధంగా ఇంజనీరు ప్లాన్ సిద్ధం చేశారు. కానీ వైసీపీ ప్రభుత్వం ఆ పథకాన్ని మరుగున పెట్టింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువుకు నీరు వచ్చే కాలువలను బాగు చేయాలని, అలాగే సోమశిల జలాలు చెరువుకు వచ్చేలా చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.



ఇరిగేషన్ మాటున
రూ.150 కోట్లకుపైగా మెక్కేశారు!
● ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి


మాతమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, అక్టోబరు 11 : సర్వేపల్లి నియోజకవర్గంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గత వైసీపీ ప్రభుత్వంలో ఇరిగేషన్ పనులు చేయకుండానే రూ.150 కోట్లకుపైగా మెక్కేశారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని ఇస్కపాళెంలో మాతమ్మ దేవాలయాన్ని శుక్రవారం సాయంత్రం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలకులు జిల్లాలో మొదటి పంటకు సాగునీరు లేకుండా చేయడం వల్ల రైతులు 3 లక్షల ఎకరాలకుపైగా బీడు పెట్టాశారన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి ఉండదని, రైతు బిడ్డలను భాగస్వాములను చేసుకొని మరీ కాలువల్లో పూడిక తీత పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో బొమ్మి సురేంద్ర, రావూరి రాధా కృష్ణమనాయుడు, తదితరులున్నారు.

పందుల బెడద నివారించాలి

అనంతసాగరం, అక్టోబరు 11 : సోమశిల క్యాంపు కాలనీ పందులకు నిలయంగా మారింది. పెంపకందారులు కాలనీని స్థావరంగా చేసుకొని ఇతర ప్రాంతాల నుంచి పందులను తెచ్చి ఇక్కడ వదిలేస్తున్నారు. దీంతో వాటి సంతతి ఎక్కువై వ్యాధుల బారిన పడుతున్నామని, ఇళ్లలోకి చొరబడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి పందుల బెడద నివారించాలని కోరుతున్నారు.








బస్సు రద్దుతో ప్రజల అవస్థలు

వరికుంటపాడు, అక్టోబరు 11: మండలంలోని గువ్వాడి మీదుగా ప్రకాశం జిల్లా పామూరుకు వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసును ఇటీవల రద్దుచేయడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కో వాల్సి వస్తోంది. ఏళ్ల తరబడి ఆ మార్గంలో ఉన్న ఉదయగిరి డిపోకు చెందిన ఏకైక బస్సును రద్దుచేయడంతో చేసేదేమిలేక ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రతినిత్యం మండల కేంద్రమైన వరికుంటపాడుకు వెళ్లే ఉద్యోగులు, ప్రజలు, అలాగే పామూరులోని కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు వైద్యశాలలకు వెళ్లే రోగుల బాధలు వర్ణణాతీతంగా మారాయి. పామూరుకు వెళ్లేందుకు ఎలాగోలా నానా బాధలు పడి వరికుంటపాడుకు చేరుకున్నప్పటికీ అక్కడ గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని, దీంతో కళాశాలలకు ఆలస్యంగా వెళ్లాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. అధిక ఛార్జీలు చెల్లించి ఆటోల్లో నివాసాలకు చేరుకోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గతంలో ఉన్న బస్సు సర్వీసును యథావిధిగా కొనసాగించాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.









ఘనంగా వాహన పూజ

ముత్తుకూరు, అక్టోబరు 11 : అదానీ కృష్ణపట్నం పోర్టులో శుక్రవారం ఘనంగా వాహన పూజ నిర్వహించారు. అడ్మిన్‌హెడ్ గణేష్‌వర్మ ఆధ్వర్యంలో పోర్టు పరిపాలన భవన ప్రాంగణంలో వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పోర్టు వాహన ఇన్‌చార్జ్ గోపికృష్ణ పుచ్చలపల్లి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మహర్నవమి వేడుకలు

ముత్తుకూరు : బ్రహ్మదేవంలోని కైలాస నాథేశ్వర స్వామి దేవ స్థానంలో శుక్రవారం మహర్నవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. మహిషాసురమర్ధిని అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.





ఉపాధి కూలీ మృతి

తోటపల్లిగూడూరు, అక్టోబరు 11: మండలంలోని సౌత్‌ఆములూరు దళిత కాలనీకి చెందిన చాట్ల మాధవ్ (47) ఉపాధి పనికి వెళ్లి శుక్రవారం మృతిచెందాడు. స్థానికుల వివరాల మేరకు.. రోజూలాగే మాధవ్ ఉపాధికూలీ పనికి వెళ్లాడు. పనిచేస్తుండగా ఛాతిలో నొప్పి రావడంతో సహచర కూలీలు ఆటోలో వైద్యశాలకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో చనిపోయాడని తెలిపారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరు తున్నారు.

ఘనంగా చండీ హోమం

పొదలకూరు, అక్టోబరు 11 : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహర్నవమి సందర్భంగా పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. అంతకుముందు కన్యపూజ జరిపారు. ఇందులో భాగంగా పలువురు చిన్నారులు వాసవీ కన్యకా పరమేశ్వరి వేషధారణతో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయి భక్తుల భిక్షాటన

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 11 : షిరిడీ సాయి బాబా 106వ మహాసమాధి ఆరాధన మహోత్సవాలు సందర్భంగా బాలాజీనగర్ పద్మావతి నగర్‌లోని సాయిదర్బార్ మందిరం ఆధ్వర్యంలో శుక్రవారం భిక్షాటన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. సాయిదర్బార్ అధ్యక్షుడు మధుసాయి ఆధ్వర్యంలో సాయి భక్తులు ఇంటింటికి తిరిగి భిక్షాటన చేశారు. 12 నుంచి మందిరంలో ఆరాధనోత్సవాలు జరుగుతాయని, భక్తులు అందరూ తరలిరావాలని నిర్వాహకులు కోరారు.





కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

నిర్వీర్యంగా సంపద తయారీ కేంద్రాలు

- ప్రభుత్వ నిధులు వృథా
- నేడు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా..
- వినియోగంలోకి తీసుకురావాలంటున్న గ్రామాల ప్రజలు



వలేటివారిపాలెంలో నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం

వలేటివారిపాలెం, అక్టోబరు 11: గ్రామాల్లో లభించే వ్యర్థాలు, చెత్తాచెదారంతో సందను సృష్టించాలన్న ఉద్దేశంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామ పంచాయతీల్లో సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చి సక్రమంగా కొనసాగేలా నడిపేది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ కేంద్రాలను నిర్వహణను గాలికి వదిలేసింది. అప్పటినుంచి లక్షలు వెచ్చించి చేపట్టిన నిర్మాణాలు నిరుపయోగంగా దర్శనం ఇస్తున్నాయి.

మండలంలోని వివరాలు ఇలా..

21గ్రామ పంచాయతీలు ఉండగా వాటిలో 16గ్రామ పంచాయతీల్లో సంపద తయారు కేంద్రాలు ఉన్నాయి. ఆయా పంచాయతీలు ఆధ్వర్యంలో సుమారు 60మంది హరితరాయబా రులు పనిచేసేవారు. పల్లెల్లోని చెత్తా,చెదారం వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేవారు. వ్యర్థాలను సంపద కేంద్రాలకే తరలించి తడి చెత్తాతో సేంద్రియ ఎరువులను తయారు చేసేవారు. ఇలా ఎంతో కొంత పంచాయతీలకు ఆదాయం వచ్చేది. ఇంతటి ఉన్నతాశయాలతో ఏర్పాటు చేసిన కేంద్రాలు నేడు మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. లక్షలు వెచ్చించి నిర్మించినా వాటి ప్రయోజనాన్ని గత వైసీపీ ప్రభుత్వం గుర్తించలేక పోయిందని గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా వీటిని వినియోగంలోకి తెచ్చి పంచాయతీలకు అదనపు ఆదాయాన్ని తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి

కందుకూరు అక్టోబరు 11 : ఎస్సీ వర్గీకరణ క్రిమిలేయర్‌కు, రాజ్యాంగ పరిరక్షణకు వ్యతిరేకంగా మాల సోదరులందరూ పోరాడాలని మాల ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తుల్లిబిల్లి అశోక్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉలవపాడు మండలంలోని కరేడులో మాల ఉద్యోగుల సంఘం నిర్వహించిన ఈ సదస్సుకు పాలేటి సుబ్బారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కోర్ కమిటీ కన్వీనర్, ఉమ్మడి ప్రకాశం జిల్లా మాల ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు చిటితోటి శ్రీరాములు, సామాజిక వేత్త సంఘ సలహాదారు పాలేటి కోటేశ్వరరావు పొనుగోటి రామారావు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న మాల ఉద్యోగుల సంఘం నాయకులు

మృతురాలి పేరుతో వ్యక్తిగత రుణం

- బజాజ్ ఫైనాన్స్ ఉద్యోగి నిర్వాకం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

కందుకూరు, అక్టోబరు 11 : చనిపోయిన వ్యక్తి పేరు మీద నెల్లూరు జిల్లా కందుకూరులోని బజాజ్ ఫైనాన్స్‌కు చెందిన వ్యక్తులు లోన్ కొట్టేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని కోటారెడ్డినగర్‌లో ఉంటున్న ఉన్నజడ కోటయ్య భార్య మరియమ్మ ఈ ఏడాది ఏప్రిల్‌లో మృతి చెందింది. బజాజ్ ఫైనాన్స్‌లో ఖాతా ఉండడంతో అక్కడ పని చేసే వలేటివారిపాలెం మండలం కళవళ్ల గ్రామానికి చెందిన కూనిపోగు వెంగయ్య అనే వ్యక్తి మరియమ్మ చనిపోయినట్టు తెలుసుకున్నాడు. ఈ నేప థ్యంలో జూన్ 26వ తేదీన మరియమ్మ ఆధార్ కాపీతో ఓ నకిలీ వ్యక్తిని తీసుకెళ్లి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో మరియమ్మ పేరిట కొత్త ఖాతా తెరిచి బజాజ్ ఫైనాన్స్ నుంచి రూ.3.27 లక్షల వ్యక్తిగత రుణం పొంది, నగదు డ్రా చేసుకున్నారు. అయితే, మరియమ్మ పేరిట రుణం ఇచ్చినట్టు బజాజ్ ఫైనాన్స్ నుంచి నెల రోజుల క్రితం బాధితుల ఇంటికి లెటర్ వెళ్లింది. దీంతో నిర్ఘాంతపోయిన కుటుంబసభ్యులు బజాజ్ ఫైనాన్స్ కంపెనీకి వెళ్లి విచా రించారు. వారి నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో శుక్రవారం కందు కూరు పోలీస్‌స్టేషన్‌లో మరియమ్మ కుమారుడు దిలీప్ ఫిర్యాదు చేశాడు.

నూతన వస్త్రాల పంపిణీ



నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

కందుకూరు, అక్టోబరు 11 : స్థానిక శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పట్టణ వీధుల్లోని నిరాశ్రయులకు శుక్రవారం మధ్యాహ్న భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. విజయదశమి సందర్భంగా దాతల సహకారంతో సుందరయ్యనగర్‌ని ఆడపిల్లలకు నూతన వస్త్రాలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోనుగుంట వేణుగోపాలరావు (శ్వేత స్టూడియో)మాట్లాడారు. రవ్వా శ్రీనివాసులు ప్రతి ఏడాదితఈ సేవ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు, చీదెళ్ల కృష్ణ, ఇనుమూరి శ్రీనివాసులు, కోటా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కావలి: స్థానిక ఆర్టీసీ డిపోలోని 15మంది పొరుగు సేవ సిబ్బందికి డిపో మేనేజరు రాపూరు శ్రీనివాసులు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ డీ.రవిప్రకాష్, అయ్యప్ప ఆలయ నిర్వహణ కమిటీ బాధ్యులు, విశ్రాంత ఎల్ఐసీ అధికారి రవీంద్రనాథ్‌లు ఉన్నారు.



దుస్తులు అందచేస్తున్న ఆర్టీసీ డీఎం తదితరులు

జయజయహే మహిషాసుర మర్దిని..

- వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు



ఉదయగిరి రూరల్ :శ్రీమహాకాళిదేవి అలంకరణలో సంతానలక్ష్మిదేవి

అల్లూరు: స్థానిక కన్యకాపరమేశ్వరి మహిషాసురమర్దిగా దర్శనమిచ్చా రు. అల్లూరు కన్యకాపరమేశ్వరి, దసరా ఆయలం, కలుగోళమ్మ, గంగమ్మ, పో లేరమ్మ ఆలయాల్లో భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. నార్తుమోపూరు మహాలక్ష్మమ్మ, ఇస్కపల్లి గంగమ్మకు విశేష పూజలు నిర్వహించారు.

కలిగిరి: తెల్లపాడు భద్రకాళి అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తుల కు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సామూహిక కుంకుమార్చన, దీపోత్స వం, పూజ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కందుకూరు: స్థానిక కోవూరు రోడ్డులోని దుర్గామాత భక్తులకు మహి షాసురమర్దినిగా దర్శన మిచ్చారు. అర్చకులు కోవూరు మాధవ రావు అష్టోత్తరం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చల్లా మధుసూదనరావు ధర్మప త్ని రమాదేవి వారి కుటుంబసభ్యులు ఉభయదాతలుగా వ్యవహ రించారు. యడ్ల మాధవరెడ్డి, ధర్మపత్ని సుధీరా భక్తలకు అన్న, ప్రసాదాలు చేశారు.

బిట్రగుంట: విశ్వనాథరావుపేట కోదండ రామాలయంలోని రాజరాజేశ్వరి అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచారు. రామస్వామి పాలెం జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో వ్యవస్థాపకులు బత్తుల రవిచంద్ర భక్తులకు అన్నసంతర్పణ చేపట్టారు.

లింగసముద్రం: మొగిలిచెర్ల దుర్గామాత అమ్మవారు భక్తులకు మహిషాసురమర్దిని రూపంలో దర్శనమిచ్చారు. భక్తులు అభిషేకం, కుంకుమార్చన చేసి పూజలుశారు. కార్యక్రమం లో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో, ఉత్తర బలిజవీధిలో జ్వాలాముఖి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణ సమీపంలో తిరునాళ్ళ తిప్పలోని కాశీనాయన ఆశ్రమ ఆవరణలో ఉన్న దేవస్థానంలో అమ్మవారు భద్రకాళీ అలంకరణలో, శివాలయంలో అన్నపూర్ణాదేవి మహాకాళీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు విశేష పూజలు, కుంకు మార్చన నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అంద చేశారు.

ఉదయగిరి రూరల్: పట్టణంలోని పార్వతీ పరమేశ్వరాలయం, శ్రీసంతాన లక్ష్మిదేవి ఆలయాల్లో అమ్మవారు శ్రీమహిషాసురమర్దిని దేవి, శ్రీమహాకాళిదేవి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. అర్చకులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్ర సాదాలు పంచి పెట్టారు.



వరికుంటపాడు : సిద్ధిధాత్రి అలంకరణలో మానసాదేవి

వరికుంటపాడు: తూర్పురొంపిదొడ్ల మానసాదేవి ఆలయంలో అమ్మ వారు సిద్ధిధాత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వరికుంటపాడు నాగారప్పమ్మ మహిషాసురమర్ధిని అలంకరణలో దర్శనమి చ్చారు.

సంగం : సంగమేశ్వరాలయంలోని అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు, పల్లకీసేవ నిర్వహించారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కావలి టౌన్, అక్టోబరు 11: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని కలుగోళశాంభవి మహిషా సురమర్దిని అలంకరణలో దర్శనమిచ్చి సింహవాహన సేవలు అందుకున్నారు. పాతూరు శివాలయంలో దుర్గాభ్రమరాంబ మహిషా సుర మర్దినిగా విష్ణాలయం రాజ్య లక్ష్మీ వీరలక్ష్మీగా, వడ్డెపాలెం కనక దుర్గాదేవి మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ముసునూరులోని మహాలక్ష్మమ్మ రాజరాజేశ్వరి దేవిగా దర్శనమిచ్చారు. హనుమత్ క్షేత్రంలో దుర్గాదే విని మహిషాసురమర్ధిని అలంకరణ చేపట్టారు.



ఉదయగిరి రూరల్: మహిషాసురమర్దిని అలంకరణలో..



కావలి టౌన్: రాజరాజేశ్వరిదేవి అలంకరణలో మహాలక్ష్మమ్మ



కందుకూరు: మహిషాసురమర్దినిగా దుర్గా అమ్మవారు



లింగసముద్రం: మహిషాసురమర్దిని రూపంలో దుర్గామాత



కలిగిరి: మహిషాసురమర్దినిగా భద్రకాళి



కావలి టౌన్: మహిషాసురమర్దినిగా కలుగోళ శాంభవి

జగనన్న లేఅవుట్‌లో అలంకారప్రాయంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- రూ.కోట్ల ప్రజాధనం వృథా



ఉదయగిరి మండలం కొండాయపాళెం జగనన్న లేఅవుట్‌లో అలంకారప్రాయంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఉదయగిరి రూరల్, అక్టోబరు 11: పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో విద్యుత్ సరఫరాకు వ్యయం చేసిన కోట్ల రూపాయల నిధులు వృధాగా మారాయి. ఈ దుస్థితి జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో నెలకొంది. అప్పట్లో పాలకులు, ఉన్నతాధికారుల నుంచి ట్రాన్స్‌కో అధికారులకు వచ్చిన వత్తిళ్ల దృష్ట్యా కనస్ట్రక్షన్ ఇంజనీరింగ్ అధికారులు హడావుడిగా ఏర్పాటుచేసిన స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు అలంకారప్రాయంగా మారాయి. జగనన్న కాలనీలు నివాసయోగ్యంగా లేకపోవడం, మౌలిక వసతులు లేని కారణంగా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు ఇష్టపడలేదు. ఇళ్ల నిర్మాణం కొన్ని ప్రదేశాల్లో గుత్తేదారులకు ఇవ్వడంతో వారు నాసిరకంగా అసంపూర్తి నిర్మాణాలు చేపట్టి వదిలేశారు. కొన్ని లేఅవుట్లతో ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకపోవడంతో బేస్‌మట్టాలు, మొండిగోడలే దర్శనమిస్తున్నాయి. రూ.కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, తీగలు దిష్టిబొమ్మలను తలపిస్తున్నాయి. కొన్ని లేఅవుట్లలో స్తంభాలు సక్రమంగా ఏర్పాటు చేయకపోవడంతో ఒరిగిపోతున్నాయి.



లేవుట్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్‌లు

రాళ్లపాడుకు 1.5 టీఎంసీల నీరు వచ్చేలా చూస్తాం



లింగసముద్రం: గంగమ్మకు జలపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి



కందుకూరు: మంత్రి లోకేష్‌కు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

లింగసముద్రం, అక్టోబరు 11: మంత్రులు పి.నారాయణ, ఆనం రాంనారాయణరెడ్డి, నిమ్మల రామానాయుడుల సహకారంతో సోమశిల నుండి ప్రాజెక్టుకు రావాల్సిన 1.5 టిఎంసీల నీరు వచ్చేలా చూస్తామని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన రాళ్లపాడు ప్రాజెక్టును సందర్శించి గంగమ్మకు జలపూజ నిర్వహించి పుష్పం, ఫలం, చీర సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రాజెక్టులో ప్రస్తుత ఉన్న నీటిమట్టం, సోమశిల నుండి ప్రాజెక్టులోకి ఏ మేరకు నీరు వస్తుంది అని డీఈ హజరత్తయ్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అడిగారు. ఈ ప్రాజెక్టుతో రైతులకు సాగు, తాగు నీటి సమస్యలు లేకుండా కృషి చేస్తామన్నారు. ఉత్తర కాలువలో నీరు వచ్చేందుకు అడ్డంకులు ఉంటే ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇరిగేషన్ చెరువుల మరమ్మతులకు రూ.300 కోట్లు విడుదల చేశారని అందులో రాళ్లపాడు ప్రాజెక్టుకు రూ.35లక్షలు విడుదల అయినట్లు తెలిపారు. ఈ నిధులతో కాలువల మరమ్మతులు, ఇతర పనులకు వినియోగిస్తామన్నారు. రాళ్లపాడు ఆయకట్టుకు నీరేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈలు చంద్రమౌళి, సింధూజ, టీడీపీ మండలాధ్యక్షులు వేముల గోపాలరావు, తెలుగు రైతు అధ్యక్షులు మద్దెల రామారావు, నేతలు అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్, సోంపల్లి మనోహర్, గొర్రెపాటి సాంబయ్య, కొండయ్య, కొండపనాయుడు పాల్గొన్నారు.

కలిగిరి: సోమశిల ఉత్తర కాలువ ఆధునీకరణ పనులకు రూ.150 కోట్లు ప్రతిపాదనలు పంపామని నిధులు మంజూరు అయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన కలిగిరి సమీపంలోని జిర్రావారిపాలెం వద్ద ఉత్తర కాలువను పరిశీలించారు. ఈ ప్రాంతంలో కాలువపై అడ్డుకట్టగా తూములు వేసి మట్టి బ్రిడ్జి నిర్మాణం చేసి ఉండటంతో నీరు ప్రవాహ వేగం తగ్గడం, అదేవిధంగా పలు చోట్ల ఉత్తర కాలువ పూడిపోయి ఉండటాన్ని గమనించారు. ఈ సమస్యతో నీరు రాళ్లపాడు వరకు రావడానికి ఆలస్యం అవుతుందని చెప్పారు. మంత్రివర్యులు ఆనం రామనారాయణరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్ లతో కలిసి ఉత్తరకాలువ క్రింద సాగుచేస్తున్న రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ప్రస్తుతం ఉత్తరకాలువపైన అవసరమైన చోట బ్రిడ్జి నిర్మాణాలను చేపడతామన్నారు. కార్యక్రమంలో రాళ్లపాడు రిజర్వాయర్ డీఈ హజరత్తయ్య, టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, పూసాల వెంగపనాయుడు, కొప్పోలు కొండలరావు, బొగ్గవరపు వేణు, లెక్కల రాంబాబు, జిర్రా పెద అంకిరెడ్డి పాల్గొన్నారు.

కందుకూరు: నియోజకవర్గ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఐటీ, విద్యామంత్రి నారా లోకేష్‌ను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం ఆయన మంత్రి లోకేషను కలిసి నియోజకవర్గంలోని దాతలు విజయవాడ వరద బాధితులకు అందించిన రూ.4,65,726ల విరాళాన్ని అందజేశారు. నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలిపే ప్రక్రియను వీలైనంత త్వరగా ప్రారంభించేలా చూడాలని లోకేష్‌ను కోరారు. రామాయపట్నం ప్రాంతంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఆయిల్ రిఫైనరీ ఏర్పాటు చేసేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వసతులు కల్పించక నిరుపయోగం..



మొగిలిచెర్లలో లక్షలాది రూపాయలతో నిర్మించిన గ్రామ సచివాలయం, హెల్త్ క్లినిక్ సెంటర్, రైతు సేవా కేంద్రం భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఈ భవనాలలో మౌలిక వసతులను కల్పించకుండా, విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయ కుండానే 2021న ప్రారంభిం చారు. అప్పటి నుండి నేటివరకు వారు పంచాయతీ కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తున్నారు. రాత్రివేళ ఆకతాయిలు అసాంఘిక పనులకు పాల్పడు తున్నారు.

\- లింగసముద్రం

పేరుకే కలెక్షన్ సెంటర్



స్థానిక వెలుగు కార్యాలయ వెనుక భాగంలో కూరగాయలు, పండ్లు, ధాన్యం సేకరణకు గత వైసీపీ ప్రభుత్వం రూ.15లక్షల వ్యయంతో సేకరణ కేంద్రం (కలెక్షన్ సెంటర్) నిర్మాణ పనులను ప్రారంభించింది. అందులో 11.25 లక్షలు ప్రభుత్వం రాయితీ ఇవ్వగా రూ.3.75 లక్షలు ఎఫ్‌పీఓ అందిస్తుంది. అయితే సేకరణ కేంద్ర నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. సేకరణ కేంద్రానికి పునాదులు వేసి ఐరన్ పైపులతో పైన రేకులు మాత్రమే ఏర్పాటు చేశారు. మిగిలిన మూడు వైపులా గోడలు నిర్మించలేదు. దీంతో రైతులు తమ పండించిన కూరగాయలు, ధాన్యం, పండ్లు పంటలు గ్రేడింగ్ చేసుకొని మార్కెట్‌కు తరలించే అవకాశం లేకుండా పోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

\- వలేటివారిపాలెం

నత్తనడకన పనులు..



అమ్మపాలెం, కొండసముద్రం గ్రామాల్లో మినహా మిగిలిన 13గ్రామాల పరిధిలో వైసీపీ ప్రభుత్వం పాల సేకరణ కేం ద్రాలు నిర్మాణ పనులు చేపట్టారు. ఒక్కో కేంద్ర భవన నిర్మాణానికి రూ.18 లక్షలు నిధులు మంజూరు చేసింది. అయితే నిర్మాణాలలో ఆశించిన పురో గతి కనిపించ లేదు. పథకం పనులు ప్రారంభించి మూడేళ్లయినా ఇంకా అసంపూర్తిగానే దర్శనం ఇస్తున్నాయి. మండలానికి 15పాలసేకరణ కేంద్రాలు మంజూరు 2మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 13పాలసేకరణ కేంద్రాలు పనులు నిలిచి లక్షలాది రూపా యలు ప్ర జాధనం వృథా అయ్యింది.

\- వలేటివారిపాలెం

బిజినెస్

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు ● శనివారం 12 అక్టోబరు 2024

ఆదాయ పన్ను వసూళ్లలో 18 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: ఆదాయ పన్ను (ఐటీ) నికర వసూళ్లు అక్టోబరు 10వ తేదీ నాటికి 18.3 శాతం పెరిగి రూ.11.25 లక్షల కోట్లకు చేరాయి. అందులో వ్యక్తిగత ఐటీ వసూళ్లు రూ.5.98 లక్షల కోట్లు కాగా కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.4.94 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇవికాకుండా సెక్యూరిటీ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) రూపంలో రూ.30,630 కోట్లు, ఇతర పన్నులు రూ.2150 కోట్లు ఉన్నాయి. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన పన్ను వసూలు మొత్తం రూ.9.51 లక్షల కోట్లు. కాగా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అక్టోబరు 10వ తేదీ మధ్య కాలంలో పన్ను రిఫండ్స్ మొత్తం రూ.2.31 లక్షల కోట్లుంది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఇది 46 శాతం అధికం. స్థూల ప్రాతిపదికన ప్రత్యక్ష పన్ను వసూళ్లు 22.3 శాతం పెరిగి రూ.13.57 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇందులో వ్యక్తిగత ఐటీ వసూలు రూ.7.13 లక్షల కోట్లు కాగా కార్పొరేట్ పన్ను వసూలు రూ.6.11 లక్షల కోట్లుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్నుల రూపంలో మొత్తం రూ.22.07 లక్షల కోట్లు వసూలు చేయాలన్నది ప్రభుత్వం బడ్జెట్లో నిర్దేశించిన లక్ష్యం.

తగ్గిన ఫారెక్స్ నిల్వలు

న్యూఢిల్లీ: విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు అక్టోబరు 4తో ముగిసిన వారంలో 370.9 కోట్ల డాలర్ల మేరకు తగ్గి 70,117.60 వద్ద స్థిరపడ్డాయని ఆర్‌బీఐ గణాంకాలు వెల్లడించాయి. అంతకు ముందు వారంలో ఇవి చారిత్రక గరిష్ఠ స్థాయి 70,488.50 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. ఇదే వారంలో బంగారం నిల్వలు 4 కోట్ల డాలర్ల మేరకు దిగజారి 6,575.6 కోట్ల డాలర్ల వద్ద స్థిరపడ్డాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,400 ▲	70,950 ▲	1,02,000 ▲
ముంబై	75,623 ▲	69,271 ▲	89,963 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	525
చిత్తూరు	538	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 78	



ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	114	విజయవాడ	125
వరంగల్	114	గుంటూరు	125
కరీంనగర్	114	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	126
కర్నూలు	114	నెల్లూరు	126
విశాఖపట్నం	120	అనంతపురం	126
గోదావరి	125		

రతన్ టాటా వారసుడిగా నోయెల్ టాటా

టాటా ట్రస్ట్స్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎంపిక

- వెంటనే అమల్లోకి వచ్చిన నియామకం
- రతన్ టాటా సవతి సోదరుడే నోయెల్
- నలభై ఏళ్లకుపైగా టాటా గ్రూప్‌తో అనుబంధం



ముంబై: టాటా గ్రూప్‌లో వారసత్వ పగ్గాల బదిలీ ప్రశాంతంగా జరుగుతోంది. టాటా ట్రస్ట్స్ కొత్త చైర్మన్‌గా రతన్ టాటా సవతి సోదరుడు నోయెల్ టాటా (67) నియమితులయ్యారు. ముంబైలో శుక్రవారం జరిగిన టాటా ట్రస్ట్స్ ట్రస్టీల సమావేశం ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ ట్రస్టులకు టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్ ఈక్విటీలో 66 శాతం వాటా ఉంది. దాదాపు ఈ ట్రస్టులన్నిటిలో నోయెల్ టాటా ఇప్పటికే ట్రస్టీగా ఉన్నారు. కొత్త చైర్మన్‌గా నోయెల్ టాటా నియామకం వెంటనే అమల్లోకి వస్తుందని టాటా ట్రస్ట్స్ ఒక ప్రకటనలో తెలిపింది. 'రతన్ టాటా, టాటా గ్రూప్ వ్యవస్థాపకుల వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు ఎదురు చూస్తున్నా' అంటూ ఈ ప్రకటన వెలువడిన వెంటనే నోయెల్ టాటా ట్వీట్ చేశారు.

2012లోనే తెరపైకి పేరు

ప్రచారానికి దూరంగా ఉండే నోయెల్ టాటా పేరు నిజానికి 2012లోనే రతన్ టాటా తర్వాత టాటా గ్రూప్ చైర్మన్‌గా తెరపైకి వచ్చింది. అయితే అప్పట్లో ఆయన తన బావమరిది సైరస్ మిస్త్రీకి ఈ పదవి కట్టబెట్టేందుకు వీలుగా ఆ పదవిపై పెద్దగా ఆసక్తి చూపలేదంటారు. ఇప్పుడు రతన్ టాటా, సైరస్ మిస్త్రీ ఇద్దరూ లేకపోవడంతో ఇక టాటా గ్రూప్ సారథ్యం స్వీకరించేందుకు నోయెల్ టాటా కాదనలేదని సమాచారం.

టాటాల మనిషే

రతన్ టాటా సవతి సోదరుడైన నోయెల్ టాటాకు.. టాటా గ్రూప్‌తో నలభై ఏళ్లకుపైగా అనుబంధం ఉంది. టాటా గ్రూప్ రిటైల్ కంపెనీ 'ట్రెంట్' బహుముఖ విస్తరణలో నోయెల్ టాటాది కీలక పాత్ర. 1998లో ఒక స్టోర్‌తో ప్రారంభించి వివిధ ఫార్మాట్లలో ఆ సంస్థను 700కుపైగా స్టోర్లకు విస్తరించారు. వెస్ట్‌సైడ్, జుడియో, క్రోమాతో పాటు ఇటీవల టాటాల గూటికి చేరిన బిగ్ బాస్కెట్ వంటి కంపెనీలన్నీ ట్రెంట్ గొడుకు కిందే పనిచేస్తాయి. లిస్టెడ్ కంపెనీ అయిన ట్రెంట్ ప్రస్తుత మార్కెట్ క్యాప్ రూ.1.81 లక్షల కోట్ల వరకు ఉంది. ఇదిగాక టాటా గ్రూప్ కంపెనీలైన వోల్టాస్, టాటా ఇంటర్నేషనల్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ వంటి అనేక టాటా గ్రూప్ కంపెనీలకూ నోయెల్ చైర్మన్‌గా ఉన్నారు. వీటికి తోడు టాటా స్టీల్, టైటాన్ కంపెనీలకు వైస్ చైర్మన్‌గానూ నోయెల్ టాటా వ్యవహరిస్తున్నారు.

కుటుంబ నేపథ్యం

నావెల్ హెచ్ టాటా.. నోయెల్ టాటా తండ్రి. తల్లి సిమోన్ హెచ్ టాటా స్విట్జర్లాండ్‌కు చెందిన వ్యాపారవేత్త. సిమోన్ హెచ్ టాటా కంటే ముందే నావెల్ హెచ్ టాటా రతన్ టాటా తల్లి సూనూ కమిశారియట్‌ను వివాహం చేసుకున్నారు. ఆ పెళ్లి ద్వారా నావెల్ హెచ్ టాటాకు రతన్, జిమ్మీ జన్మించారు. ఈ ముగ్గురు అన్నదమ్ముల్లో నోయెల్ టాటా మాత్రమే వివాహితుడు. రతన్ టాటా, జిమ్మీ టాటా అవివాహితులు. నోయెల్ టాటా భార్య ఆలూ మిస్త్రీ. రతన్ టాటా తర్వాత టాటా గ్రూప్ పగ్గాలు చేపట్టిన సైరస్ మిస్త్రీకి స్వయానా సోదరి. షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ అధినేత పల్లోంజీ మిస్త్రీ కుమార్తె.

షాపూర్జీ పల్లోంజీ కుటుంబానికి టాటా సన్స్‌లో 18.4 శాతం వాటా ఉన్న సంగతి తెలిసిందే. అంతేకాదు టాటా సన్స్‌లో షాపూర్జీ పల్లోంజీ కుటుంబం అతిపెద్ద ప్రైవేట్ వాటాదారుగా ఉంది. నోయెల్ టాటా-ఆలూ మిస్త్రీ దంపతులకు లీ, మాయ అనే కుమార్తెలతో పాటు నెవిల్లే అనే ఒక కుమారుడు ఉన్నారు. ఇందులో లీ టాటా.. ప్రస్తుతం తాజ్ హోటల్స్‌ను నిర్వహించే ది ఇండియన్ హోటల్స్ వైస్ ప్రెసిడెంట్‌గా, మాయా టాటా క్యాపిటల్ కంపెనీలో ఉన్నత స్థానాల్లో పని చేస్తున్నారు. కుమారుడు నెవిల్లే కూడా ట్రెంట్, స్టార్ బజార్ సారథ్య బాధ్యతలు చూసుకుంటున్నారు.

పారిశ్రామికం నేలచూపు

న్యూఢిల్లీ: సుమారు రెండు సంవత్సరాల అనంతరం దేశంలో పారిశ్రామికోత్పత్తి ఆగస్టు నెలలో తొలిసారిగా ప్రతికూల వృద్ధిలో ప్రవేశించింది. మైనింగ్, విద్యుదుత్పత్తి రంగాల ఉత్పత్తి క్షీణత కారణంగా పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) గత ఏడాది ఆగస్టుతో పోల్చితే మైనస్ 0.1 శాతానికి దిగజారింది. జూలై నెల పారిశ్రామికోత్పత్తి వృద్ధి రేటును కూడా 4.8 శాతం నుంచి 4.7 శాతానికి కుదించారు. గత ఏడాది ఆగస్టులో ఐఐపీ వృద్ధి రేటు 10.9 శాతం ఉండగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-ఆగస్టు నెలల మధ్య కాలంలో ఐఐపీ వృద్ధి రేటు 4.2 శాతానికి పరిమితమైంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది 6.2 శాతంగా ఉంది. ఈ ఆగస్టులో మైనింగ్ రంగం మైనస్ 4.3 శాతం, తయారీ రంగం 0.1 శాతం, విద్యుత్ రంగం మైనస్ 3.7 శాతం వృద్ధిని నమోదు చేశాయి. 2022 అక్టోబరులో నమోదైన 4.1 శాతం ప్రతికూల వృద్ధి తర్వాత ఐఐపీ నెగిటివ్ జోన్‌లోకి రావడం ఇదే ప్రథమం.

అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లో మార్కెట్

ముంబై: పారిశ్రామికోత్పత్తి గణాంకాలు వెలువడడానికి ముందు ఇన్వెస్టర్లలో నెలకొన్న అప్రమత్తత, అమ్మకాల ఒత్తిడి ప్రభావంతో శుక్రవారం స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. కొద్ది రోజులుగా విదేశీ నిధులు తరలిపోతూ ఉండడం, రూపాయి బలహీనత, ప్రపంచ భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇన్వెస్టర్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. బ్యాంకింగ్, యుటిలిటీ, ఫైనాన్షియల్ విభాగాల షేర్లలో ఇన్వెస్టర్లు అమ్మకాలు సాగించారు. అయితే మెటల్ విభాగం షేర్లలో జోరుగా కొనుగోళ్లు సాగడంతో నష్టాలు కొంత మేరకు పరిమితం అయ్యాయి. మొత్తం మీద ఆటుపోట్లతో సాగిన పయనంలో సెన్సెక్స్ 230.05 పాయింట్ల నష్టంతో 81381.36 వద్ద ముగియగా నిఫ్టీ 34.20 పాయింట్ల నష్టంతో 24,964.25 వద్ద ముగిసింది. మార్కెట్‌ను ఉత్తేజపరిచే వార్తలేవీ లేకపోవడం వల్ల ట్రేడింగ్ పూర్తిగా సైడ్‌వేస్ ధోరణిలో సాగిందని విశ్లేషకులంటున్నారు.

ట్రాఫిక్‌సోల్ ఐటీఎస్ టెక్నాలజీస్‌పై సెబీ దర్యాప్తు: ఎస్ఎంఈ విభాగంలోని ట్రాఫిక్‌సోల్ ఐటీఎస్ టెక్నాలజీస్ షేర్ల లిస్టింగ్‌ను నిలిపివేయాలని బీఎస్ఈని సెబీ ఆదేశించింది. ఐపీఓకు అనుమతి కోరుతూ సమర్పించిన దరఖాస్తులో సంస్థ చేసినట్టు చెబుతున్న తప్పుడు ప్రకటనలపై సవివరమైన దర్యాప్తు చేపట్టాలని సెబీ నిర్ణయించింది. ఈ దర్యాప్తు 30 రోజుల వ్యవధిలో పూర్తి చేయాలని సెబీ గడువు పెట్టింది. ఆ సంస్థ ఐపీఓ ద్వారా సేకరించిన సొమ్మును వడ్డీ ఆర్జించే ఎస్క్రో ఖాతాలో భద్రపరచాలని బీఎస్ఈకి సూచించింది. ఎస్ఎంఈ వేదిక ద్వారా కంపెనీ షేర్ల లిస్టింగ్‌ను బీఎస్ఈ వాయిదా వేసిన 30 రోజుల అనంతరం సెబీ నుంచి ఈ ఆదేశాలు వెలువడ్డాయి. రూ.66-70 ధరల శ్రేణిలో జారీ అయిన ఈ ఐపీఓకి 345 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్ లభించింది. రూ.45 కోట్లు వసూలు చేయాలన్నది లక్ష్యం కాగా రూ.10,000 కోట్లకు పైబడిన బిడ్లు దాఖలయ్యాయి.

- బర్నర్స్ తయారీ కంపెనీ మయూఖ్ డీల్ ట్రేడ్ లిమిటెడ్.. రైట్స్ ఇష్యూ ద్వారా రూ.49 కోట్లు సమీకరించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు కంపెనీ బోర్డు ఆమోదం లభించిందని తెలిపింది. అలాగే రూ.5 ముఖ విలువతో కూడిన ప్రతి షేరును రూ.1 ముఖ విలువతో కూడిన ఐదు షేర్లుగా విభజించేందుకు కూడా బోర్డు ఆమోదం లభించిందని వెల్లడించింది.

ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపాయి

ముంబై: ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు రోజురోజుకీ కుదేలవుతోంది. శుక్రవారం మరో 12 పైసలు నష్టపోయి రూ.84.10 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం రేటు ఇంత కనిష్ఠ స్థాయికి పడిపోవడం ఇదే మొదటిసారి. శుక్రవారం ఉదయం గురువారంతో పోలిస్తే ఒక పైసా నష్టంతో రూ.83.97 వద్ద కొద్దిగా మెరుగ్గానే ప్రారంభమైనా ఇంట్రాడేలో రూ.83.96-84.10 మధ్య ట్రేడైంది. చివరికి గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.84.10 వద్ద ముగిసింది. స్టాక్ మార్కెట్లో కొనసాగుతున్న ఎఫ్‌పీఐల అమ్మకాలు, పశ్చిమాసియా ఉద్రిక్తతలతో మండుతున్న చమురు ధర ఇందుకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

టయోటా కిర్లోస్కర్ కొత్త అర్బన్ క్రూయిజర్ హైరైడర్



బెంగళూరు: టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) మార్కెట్లోకి ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్ అర్బన్ క్రూయిజర్ హైరైడర్‌ను విడుదల చేసింది. ప్రీమియం యాక్సెసరీస్ ప్యాకేజీ, స్మార్ట్‌నెస్, మరింత కంఫర్ట్‌తో దీన్ని తీసుకువచ్చింది. జీ, వీ వేరియంట్స్‌తో హైబ్రిడ్, నియో డ్రైవ్ పవర్‌ట్రెయిన్స్‌తో ఇది అందుబాటులో ఉండనుంది. దేశవ్యాప్తంగా ఉన్న టయోటా డీలర్‌షిప్ కేంద్రాల్లో సమగ్ర ప్యాకేజీతో ఈ అర్బన్ క్రూయిజర్ అందుబాటులో ఉంటుందని టీకేఎం వెల్లడించింది.

- జేఎం ఫైనాన్షియల్ హోమ్ లోన్స్ లిమిటెడ్ (జేఎంఎఫ్‌హెచ్ఎల్ఎల్).. ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలను మరింతగా విస్తరించింది. ఇందులో భాగంగా ఏలూరులో కంపెనీ కొత్త శాఖను ప్రారంభించింది. జేఎంఎఫ్‌హెచ్ఎల్ఎల్‌కు రాష్ట్రంలో ఇది 10వ శాఖ. ఈ కొత్త శాఖ ఏర్పాటుతో దేశవ్యాప్తంగా మొత్తం బ్రాంచీల సంఖ్య 126కి చేరింది.
- ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ అల్ట్రావయొలెట్.. ఆంధ్రప్రదేశ్ మార్కెట్లోకి అడుగుపెట్టింది. ఇందులో భాగంగా విశాఖపట్నంలో తొలి యూవీ స్పేస్ స్టేషన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. ఈ సెంటర్‌లో 10.3 కిలోవాట్ ఎస్ఆర్‌బీ7 లిథియం అయాన్ బ్యాటరీతో కూడిన ఎఫ్77 మాక్ 2 ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ అందుబాటులో ఉంటాయి.
- ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ కంపెనీ వారివో మోటార్ ఇండియా.. బ్యాటరీ స్మార్ట్‌తో జట్టు కట్టింది. ఒప్పందంలో భాగంగా బీ2బీ ఎలక్ట్రిక్ మొబిలిటీ కోసం బ్యాటరీ స్వాపింగ్ టెక్నాలజీని బ్యాటరీ స్మార్ట్ అందించనుంది. వచ్చే ఏడాది చివరి నాటికి బీ2బీ విభాగంలో 20 వేల స్కూటర్లను విక్రయించాలని వారివో లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వాహనాలకు అవసరమైన బ్యాటరీ స్వాపింగ్ సేవలను అందించేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని వారివో భావిస్తోంది.



టీమిండియా క్రికెటర్ మహ్మద్ సిరాజ్ డీఎస్పీగా విధుల్లో చేరాడు. శుక్రవారం హైదరాబాద్‌లో డీజీపీ జితేందర్ రెడ్డిని ఆయన కార్యాలయంలోనే మర్యాదపూర్వకంగా కలిసి జాయినింగ్ రిపోర్టును అందించాడు. రాష్ట్ర కేబినెట్ తీర్మానం మేరకు నిబంధనలను సడలించి, ప్రత్యేక జీఓ విడుదల చేసి సిరాజ్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చారు.



ఆస్ట్రేలియా హ్యాట్రిక్

9 వికెట్లతో పాకిస్థాన్‌పై గెలుపు

మహిళల టీ20 వరల్డ్ కప్

దుబాయ్: డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా టీ20 వరల్డ్ కప్‌లో వరుసగా మూడో విజయంతో హ్యాట్రిక్ కొట్టింది. శుక్రవారం జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో తొమ్మిది వికెట్లతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. తద్వారా గ్రూప్ టాపర్ స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకోవడంతో సెమీఫైనల్ స్థానాన్ని దాదాపు ఖాయం చేసుకుంది. మొదట పాకిస్థాన్ 19.5 ఓవర్లలో 82 పరుగులకే కుప్పకూలింది. అలియా రియాజ్ (26), సిద్రా అమీన్ (12), ఇరామ్ జావెద్ (12) మోస్తరుగా ఆడారు. గార్డెనర్ నాలుగు, సదర్లాండ్, వేరామ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఇక స్వల్ప లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 11 ఓవర్లలో 83/1 స్కోరుతో ఛేదించింది. కెప్టెన్ హీలీ (37 రిటైర్డ్ హర్ట్), ఎలీస్ పెర్రీ (22 నాటౌట్) మెరిశారు. గార్డెనర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. ఆదివారం జరిగే తదుపరి మ్యాచ్‌లో భారత్‌ను ఆస్ట్రేలియా ఢీకొననుంది.

సంక్షిప్తస్కోర్లు: పాకిస్థాన్: 19.5 ఓవర్లలో 82 ఆలౌట్ (అలియా రియాజ్ 26, సిద్రా అమిన్ 12, ఇరామ్ జావెద్ 12, గార్డెనర్ 4/21, సదర్లాండ్ 2/15, వేరామ్ 2/16); **ఆస్ట్రేలియా:** 11 ఓవర్లలో 83/1 (హీలీ 37 రిటైర్డ్ హర్ట్, ఎలీస్ పెర్రీ 22 నాటౌట్, గార్డెనర్ 7 నాటౌట్, సాదియా ఇక్బాల్ 1/17).

ఫైనల్లో అలాస్కన్‌తో త్రివేణి ఢీ

లండన్: గ్లోబల్ చెస్ లీగ్ ఫైనల్లో టేబుల్ టాపర్ పీబీజీ అలాస్కన్ నైట్స్‌తో త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ అమీతుమీ తేల్చుకోనుంది. శుక్రవారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో త్రివేణి 9-7తో ఆల్పైన్ ఎస్‌జీ పైపర్స్‌పై గెలిచింది. ఇతర మ్యాచ్‌ల్లో అలాస్కన్ నైట్స్ 14-5తో అమెరికన్ గ్యాంబిట్స్‌పై, గ్యాంజీస్ గ్రాండ్‌మాస్టర్స్ 12-4తో అప్‌గ్రాడ్ ముంబా మాస్టర్స్‌పై నెగ్గాయి. లీగ్ దశ ముగిసేసరికి అలాస్కన్ 114 పాయింట్లతో టాప్‌లో నిలవగా, త్రివేణి 99 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. శనివారం ఫైనల్ జరగనుంది.

టార్గెట్ .. క్లీన్‌స్వీప్

మ్యాచ్ రా. 7 గం.నుంచి స్పోర్ట్స్ 18లో...



ఉప్పల్ మైదానంలో పిచ్‌ని పరిశీలిస్తున్న కెప్టెన్ సూర్యకుమార్

ఉప్పల్ వేదికగా పోరు

టీమిండియాలో మార్పులు ? బంగ్లాతో నేడు ఆఖరి టీ20

హైదరాబాద్: తొలి రెండు టీ20ల్లో ఏకపక్ష విజయాలు సాధించిన భారత్..బంగ్లాదేశ్‌తో ఆఖరి మ్యాచ్‌లోనూ ఆ జోరు కొనసాగించడం ద్వారా సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని భావిస్తోంది. రెండు జట్ల మధ్య మూడో, చివరి మ్యాచ్ శనివారం ఇక్కడ జరగనుంది. మరోవైపు ఈ మ్యాచ్‌లో గెలుపొంది వెటరన్ మహ్మదుల్లాకు విజయంతో వీడ్కోలునివ్వాలని బంగ్లాదేశ్ పట్టుదలగా ఉంది. సిరీస్‌ను టీమిండియా ఇప్పటికే సొంతం చేసుకున్న నేపథ్యంలో రిజర్వ్ ఆటగాళ్లను పరిశీలించే అవకాశముంది. దాంతో లెగ్‌స్పిన్నర్ రవి బిష్ణోయ్, హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మ, జితేశ్ శర్మ, హర్షిత్ రాణాల్లో ఒకరిద్దరికి స్థానం దక్కవచ్చు. రెండు మ్యాచ్‌ల్లోనూ ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ అంచనాలను అందుకోలేకపోయారు. మొదటి టీ20లో ఇద్దరూ తక్కువ స్కోర్లకే అవుట్‌కాగా..ఢిల్లీ మ్యాచ్‌లో చక్కటి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. ఇక..తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్‌పై మరోసారి అందరి దృష్టీ నిలిచింది. రెండో టీ20లో బంగ్లాదేశ్ బౌలర్లను ఎడాపెడా బాదేసిన నితీష్..బౌలింగ్‌లోనూ రాణించి రెండు వికెట్లు పడగొట్టాడు. సుదీర్ఘకాలం తర్వాత జట్టులో చోటు దక్కించుకున్న మిస్టర్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి రెండు మ్యాచ్‌ల్లోనూ సత్తా చాటాడు. స్పీడ్‌స్టర్ మయాంక్ యాదవ్ 150 కి.మీ.లకుపైగా వేగంతో ఆకట్టుకున్నాడు. 38 ఏళ్ల బంగ్లా వెటరన్ ఆటగాడు మహ్మదుల్లా ఆఖరి టీ20 మ్యాచ్ ఆడబోతున్నాడు. ఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ టాపార్డర్ బ్యాటర్లంతా విఫలమైన వేళ..మహ్మదుల్లా (41)నే చెప్పుకోతగ్గ స్కోరు చేయడం గమనార్హం. మరి..విజయంతో అతడికి వీడ్కోలు పలకాలంటే బంగ్లాదేశ్ బ్యాటర్లతోపాటు బౌలర్లు అద్భుతంగా రాణించక తప్పదు.



షంటో

జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, నితీశ్ కుమార్, రింకూ సింగ్, హార్దిక్, పరాగ్, సుందర్, వరుణ్/బిష్ణోయ్, అర్ష్‌దీప్, మయాంక్ యాదవ్/హర్షిత్.

బంగ్లాదేశ్: షంటో (కెప్టెన్), పర్వేజ్, లిట్టన్ (కీపర్), తౌహిద్, మహ్మదుల్లా, మెహిదీహసన్, మెహిదీహసన్ మిరాజ్, రిషద్, టస్కిన్, తన్జిమ్ సకీబ్, ముస్తాఫిజుర్

పిచ్: ఈ పిచ్‌పై 2024 ఐపీఎల్‌లో మూడు జట్లు తొలుత బ్యాటింగ్ చేసి 200లకుపైగా పరుగులు చేసి గెలుపొందాయి. అంటే..పరుగుల వరద ఖాయమన్నమాట.

వాతావరణం..

గత రెండు రోజులుగా హైదరాబాద్‌లో సాయంత్రం వేళ వర్షం కురుస్తోంది. శుక్రవారం కూడా భారీ వర్షం కురవడంతో మైదానాన్ని కవర్లతో కప్పాల్సి వచ్చింది. దాంతో బంగ్లాదేశ్ జట్టు ప్రాక్టీస్‌కు అంతరాయం కలిగింది. శనివారం ఉదయం వర్షం కురిసే అవకాశం 40 శాతం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. అయితే మ్యాచ్ సమయంలో వర్షానికి లేకపోయినా, ఆకాశం మేఘావృతమై ఉంటుందని సమాచారం.

స్పోర్ట్స్

మహిళల వరల్డ్‌కప్‌లో నేడు

న్యూజిలాండ్ X శ్రీలంక	మ. 3.30
బంగ్లాదేశ్ X దక్షిణాఫ్రికా	రా. 7.30

కివీస్‌తో టెస్టులకు రోహిత్ సేన ఇదే..

రిజర్వ్ ఆటగాడిగా నితీశ్



ముంబై: స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరగనున్న మూడు టెస్టుల సిరీస్‌కు భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. రోహిత్ శర్మ సారథ్యంలోని ఈ జట్టుకు బుమ్రాను వైస్‌కెప్టెన్‌గా నియమించారు. ఈనెల 16న బెంగళూరులో జరిగే తొలి టెస్టుతో ఈ సిరీస్ ఆరంభమవనుంది.

జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్),బుమ్రా (వైస్ కెప్టెన్)యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్, రిషభ్ పంత్ (వికెట్‌కీపర్), ధ్రువ్ జురెల్ (వికెట్‌కీపర్), రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ఆకాష్‌దీప్; **రిజర్వ్ ప్లేయర్లు:** నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, మయాంక్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ

సెమీస్‌లో రష్మిక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఐటీఎఫ్ మహిళల వరల్డ్ టెన్నిస్ టూర్ మైసూర్ ఓపెన్‌లో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక సెమీఫైనల్లో ప్రవేశించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్స్ పోరులో శ్రీవల్లి 6-2, 6-2తో భారత్‌కే చెందిన ఆకాంక్షపై నెగ్గి టైటిల్‌కు చేరువైంది. అంతకుముందు జరిగిన ప్రీక్వార్టర్స్‌లో రష్మిక 6-1, 6-3తో తనీషా కశ్యప్‌పై గెలుపొందింది.

చెలరేగిన ఆంధ్ర బౌలర్లు

విదర్భ 118 ఆలౌట్



శశికాంత్ (3/31)

నాగ్‌పూర్: ఆంధ్ర పేస్ బౌలర్లు చెలరేగడంతో రంజీ సీజన్ తొలి మ్యాచ్‌లో విదర్భ జట్టు కుప్పకూలింది. సొంతగడ్డపై శుక్రవారం మొదలైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన విదర్భ.. పిచ్‌ని సరిగా అంచనా వేయలేక తొలి ఇన్నింగ్స్‌లో 38.5 ఓవర్లలో కేవలం 118 పరుగులకే ఆలౌటైంది. అక్షయ్ వాడ్కర్ (46 నాటౌట్) మినహా అందరూ విఫలమయ్యారు. ఆంధ్ర పేసర్లు శశికాంత్ (3/31), స్టీఫెన్ (2/43), సత్యనారాయణ రాజు (2/26)తోపాటు స్పిన్నర్ లలిత్ మోహన్ (2/18) అదరగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన ఆంధ్ర జట్టు 33 ఓవర్లలో వికెట్ నష్టానికి 114 పరుగులు చేసింది. అభిషేక్ రెడ్డి (62 నాటౌట్), షేక్ రషీద్ (49 నాటౌట్) క్రీజులో ఉన్నారు. హనుమ విహారి (1) విఫలమయ్యాడు.

పాక్‌కు ఘోర పరాభవం

ఇన్నింగ్స్ తేడాతో ఇంగ్లండ్ విజయం



జాక్ లీచ్ (4/30)

ముల్తాన్: టెస్టు క్రికెట్ చరిత్రలోనే ఘోర పరాజయాన్ని పాకిస్థాన్ జట్టు మూటగట్టుకుంది. శుక్రవారం ముగిసిన తొలి టెస్టులో ఇంగ్లండ్ జట్టు ఇన్నింగ్స్ 47 పరుగుల తేడాతో భారీ విజయాన్ని అందుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 152/6తో ఆఖరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్థాన్ 220 పరుగులకు ఆలౌటైంది. 11వ నెంబర్ ఆటగాడు అబ్రార్ అహ్మద్ జ్వరం కారణంగా బ్యాటింగ్‌కు దిగలేదు. సల్మాన్ ఆగా (63), ఆమెర్ జమాల్ (55 నాటౌట్) రాణించారు. ఐదోరోజు పతనమైన మూడు వికెట్లనూ జాక్ లీచ్ సాధించాడు. మొత్తంగా లీచ్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. కాగా 147 సంవత్సరాల టెస్ట్ క్రికెట్ చరిత్రలో మొదటి ఇన్నింగ్స్‌లో 500కు పైగా పరుగులు సాధించి..ఇన్నింగ్స్ తేడాతో ఓటమిపాలైన తొలి జట్టుగా పాక్ అపఖ్యాతిని మూటగట్టుకుంది. మొదటి ఇన్నింగ్స్‌లో పాక్ 556, ఇంగ్లండ్ 7 వికెట్లకు 823 (డిక్లేర్డ్) పరుగులు చేశాయి. కాగా 2021 ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకూ పాకిస్థాన్ జట్టుకు సొంతగడ్డపై విజయం దక్కలేదు. అప్పటినుంచి 11 టెస్టులాడి ఏడు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది.

దేవర 2లో రణ్‌బీర్, రణ్‌వీర్?



ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన 'దేవర' చిత్రం ఇటీవలే విడుదలై పాన్ ఇండియా స్థాయిలో ఘన విజయం అందుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ చిత్రానికి కొనసాగింపుగా రాబోతున్న 'దేవర 2' చిత్రం గురించి పలు ఆసక్తికర విషయాలను కొరటాల శివ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'దేవర' చిత్రంలో విలన్ పాత్రలో బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్, కథానాయికగా జాన్వీకపూర్ నటించారు. వీరితో పాటు రెండో భాగంలో మరికొందరు బాలీవుడ్ తారలు భాగమవనున్నారని ఆయన చెప్పారు. 'దేవర 2'లో కొన్ని అతిథి పాత్రలు ఉన్నాయి. అవి కథలో చాలా కీలకంగా ఉంటాయి. రణ్‌వీర్‌సింగ్, రణ్‌బీర్‌కపూర్ లాంటి బాలీవుడ్ స్టార్స్ ఆ పాత్రల్లో నటిస్తే బాగుంటుందని నాకు అనిపిస్తోంది. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. జరుగుతుందో లేదో తెలియదు కాబట్టి ఇప్పుడే దీని గురించి నేను ఎక్కువ మాట్లాడ కూడదు. కొంతమంది తెలుగు, తమిళ హీరోలు అయినా ఆ పాత్రలు పోషిస్తే బావుంటుంది. వారి పేర్లు చెబితే ఇప్పటి నుంచే ఊహాగానాలు మొదలవుతాయి కాబట్టి చెప్పడం లేదు. త్వరలోనే వివరాలు ప్రకటిస్తాం' అన్నారు.



వశిష్ట దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' సెట్స్‌లో సందడి నెలకొంది. శుక్రవారం వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి ఈ మూవీ సెట్స్‌కు వచ్చారు. ఈ సందర్భంగా చిరంజీవితో కలసి వెంకటేశ్, అనిల్ రావిపూడి, మీనాక్షీ చౌదరి, ఐశ్వర్య రాజేశ్ దిగిన ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి.

రాజకీయాల్లోకి సాయాజీ షిండే



వెండితెరపై విలన్, కమెడియన్ పాత్రల్లో నటించి తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన మరాఠా నటుడు సాయాజీషిండే రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. శుక్రవారం ఆయన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్‌పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ)లో చేరారు. అజిత్‌పవార్ స్వయంగా కండువా కప్పి సాయాజీ షిండేను పార్టీలోకి ఆహ్వానించారు. అజిత్‌పవార్ పనితీరు నచ్చి ఎన్సీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు షిండే తెలిపారు. త్వరలో మహారాష్ట్రలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్సీపీ తరఫున ప్రచారం చేయడంతో పాటు సాయాజీ షిండే ఎమ్మెల్యేగా బరిలో నిలవనున్నారని సమాచారం.

రేసర్‌గా నిఖిల్



సుధీర్ వర్మ దర్శకత్వంలో నిఖిల్ సిద్ధార్థ్, రుక్మిణీ వసంత్ జంటగా నటిస్తున్న చిత్రం 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'. బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో నిఖిల్ రిషి అనే పాత్రలో రేసర్‌గా కనిపించనున్నారు. నవంబర్ 8న సినిమా విడుదల కానుంది. హర్ష చెముడు, దివ్యాంశ కౌశిక్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎడిటర్: నవీన్ నూలి, సినిమాటోగ్రఫీ: రిచర్డ్ ప్రసాద్.

మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నా



బాలీవుడ్ హీరోయిన్ అలియాభట్‌ను కథానాయిక రష్మిక మందన్న పొగడ్తలతో ముంచెత్తారు. శుక్రవారం అలియా నటించిన 'జిగ్రా' చిత్రం విడుదలైంది. ప్రత్యేక ప్రదర్శనకు రష్మిక హాజరయ్యారు. ఈ నేపథ్యంలో అలియా కథల ఎంపిక అద్భుతంగా ఉందని ఇన్‌స్టాగ్రామ్‌లో రష్మిక మెచ్చుకున్నారు. 'అలియా నువ్వు మాకు దొరకడం ఓ వరం. నటిగా నీలోని ప్రతిభను మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నాను. విభిన్నమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తున్నందుకు ధన్యవాదాలు. ఇలానే మరెన్నో గొప్ప చిత్రాల్లో ప్రేక్షకులను అలరించాలి' అని ఆకాంక్షించారు.

గొప్ప చిత్రాల్లో ఒకటిగా నిలుస్తుంది



మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ నటించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్య దేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. మీనాక్షీ చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. ఈ నెల 31 సినిమా విడుదలవుతోంది. శుక్రవారం ఈ చిత్ర దర్శకుడు, నిర్మాత మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ "త్వరలోనే సినిమా ట్రైలర్‌ను విడుదల చేయనున్నాం. సినిమా అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది. ఈ మధ్య కాలంలో తెరకెక్కిన గొప్ప చిత్రాలలో ఇది ఒకటిగా నిలుస్తుంది. విజయంపై పూర్తి ధీమాతో ఉన్నాం" అని చెప్పారు. "ఇది 1980-90ల కాలంలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనలను ఆధారంగా చేసుకుని రాసుకున్న కల్పిత కథ. ఇప్పటిదాకా నేను తీసిన సినిమాల్లో ఇది ప్రత్యేక చిత్రంగా నిలుస్తుంది. సినిమా సాంకేతికంగా ఉన్నతంగా ఉంటుంది" అని దర్శకుడు వెంకీ అట్లూరి చెప్పారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt. Ltd., *Printed and Published* at "Aamoda Press" at 91, Wood Complex, Vedayapalem, Nellore, A.P., Tel. No.0861-2312299, Editor: **K.Srinivas,**
RNI No. APTEL/2004/11742, **Managing Director : Vemuri Radha Krishna**, Founder: K.L.N.Prasad.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

భక్తిశ్రద్ధలతో సాయి భక్తుల భిక్షాటన

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 11 : షిరిడీ సాయిబాబా 106వ మహా సమాధి ఆరాధన మహోత్సవాల సందర్భంగా బాలాజీనగర్ పద్మావతి నగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరం ఆధ్వర్యంలో శుక్రవారం భిక్షాటన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. సాయిదర్బార్ అధ్యక్షుడు మధుసాయి ఆధ్వర్యంలో సాయి భక్తులు ఇంటింటికి తిరిగి భిక్షాటన చేశారు. 12 నుంచి మందిరంలో ఆరాధనోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.


బాలాజీనగర్‌లో భిక్షాటన చేస్తున్న సాయి భక్తులు

విద్యుత్ శాఖ అతిథి గృహం ప్రారంభం

నెల్లూరు(జడ్పీ), అక్టోబరు 11: నగరంలోని విద్యుత్ భవన్ వద్ద విద్యుత్ శాఖ నూతన అతిథి గృహాన్ని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు జిల్లాకు విచ్చేసిన సందర్భంలో అతిథి గృహం ఎంతో అవసరం ఉంటుందన్నారు. అత్యాధునిక వసతులతో నిర్మించిన అతిథి గృహానికి నిర్వాహణ కూడా అలాగే ఉండాలని ఎస్ఈ విజయన్‌కి సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గిరిధర్ రెడ్డి, దొడ్డపనేని రాజానాయుడు, కార్పొరేటర్ మురహరి, విద్యుత్‌శాఖాధి కారులు తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ శాఖ నూతన అతిథి గృహం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

తోటపల్లిగూడూరు, అక్టోబరు 11 : మండలంలోని సౌత్‌ఆములూరు దళిత కాలనీకి చెందిన చాట్ల మాధవ్ (47) ఉపాధి పనికి వెళ్లి శుక్రవారం మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. రోజూ లాగే మాధవ్ ఉపాధి కూలీ పనికి వెళ్లాడు. పని చేస్తుండగా ఛాతిలో నొప్పి రావడంతో సహచర కూలీలు ఆటోలో వైద్యశాలకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో చనిపోయాడని తెలిపారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్‌సీసీ కేర్ టేకింగ్ అధికారికి లెఫ్టినెంట్ హోదా

విడవలూరు, అక్టోబరు 11: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేర్ టేకింగ్ అధికారి న్యామతుల్లాకి లెఫ్టినెంట్ హోదా దక్కినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుజాత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మహారాష్ట్రలోని నాగ్ పూర్‌లో ఎన్‌సీసీ ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమిలో 75రోజులు శిక్షణ పొంది, అక్కడ నిర్వహించిన పరీక్షల్లో న్యామతుల్లా ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి



పూడికతీత పనులను పరిశీలిస్తున్న బెజవాడ వంశీ కృష్ణారెడ్డి

సొంతనిధులతో పూడికతీత పనులు

విడవలూరు, అక్టోబరు 11: నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సొంత నిధులతో ఊటు కూరు తుంగ చెరువు కాలువ పూడికతీత పనులు చేపట్టారని టీడీపీ మండల మాజీ అధ్యక్షులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి తెలి పారు. ఈ పనులను శుక్రవారం కోవూరు ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామిరెడ్డి విజయభానురెడ్డితో కలిసి పరిశీలించారు. సాగు నీరు పారుదల విషయంలో ఇబ్బందులు లేకుండా వీపీఆర్ ట్రస్టు ద్వారా ఈ పనులు చేపట్టారన్నారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పోర్టులో వాహన పూజ



ముత్తుకూరు, అక్టోబరు 11 : అదానీ కృష్ణపట్నం పోర్టులో శుక్రవారం ఘనంగా వాహన పూజ నిర్వహించారు. అడ్మిన్‌హెడ్ గణేష్ వర్మ ఆధ్వర్యంలో పోర్టు పరిపాలన భవన ప్రాంగణంలో వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పోర్టు వాహన ఇన్‌చార్జ్ గోపికృష్ణ పుచ్చలపల్లి శ్రీనివాసులు, జి రాజేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చండీ హోమం



కన్యకా పరమేశ్వరి వేషధారణలో చిన్నారులు

పొదలకూరు, అక్టోబరు 11 : శరన్నవరాత్రి ఉత్స వాల్లో భాగంగా శుక్రవారం మహర్నవమి సందర్భంగా పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. అంతకుముందు కన్యపూజ జరిపారు. ఇందులో భాగంగా పలువురు చిన్నారులు వాసవీ కన్యకా పరమేశ్వరి వేషధారణతో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బౌద్ధధర్మ దీక్షకు తరలిరండి

అల్లూరు, అక్టోబరు 11: బౌద్ధధర్మ దీక్షకు అంబేద్కర్ అభిమానులు భారీగా తరలిరావాలని భీమ్ ఆర్మీ తెలంగాణ సోషల్ మీడియా కన్వీనర్ పొంగులూరు ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక పాతబస్టాండు కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం దళితులు చేపట్టిన ప్రదర్శన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శనివారం నెల్లూరు గాంధీబొమ్మ సెంటరు నుండి వీఆర్సీ సెంటరులోని అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించే దమ్మ ర్యాలీలో పాల్గొనాలన్నారు. ఉదయం 10గంటలకు స్వతంత్ర పార్కు వద్దకు చేరుకోవాలని కోరారు.

భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

కోవూరు: స్థానిక గ్రామదేవత నాగవరప్పమ్మను కాళికాదేవిగా అలంకరించారు. ఉభయదాతలుగా కొత్తూరు, వేమారెడ్డి తోటవాసులు వ్యవహరించారు. ఆలయ పూజారి విశ్వనాథం సుబ్బరామయ్య పూలంగిసేవ, పల్లకీసేవ నిర్వహించారు.

బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడ కామాక్షితాయి మహిషాసురమర్ది అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం స్వామి వారికి మమన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి నవావరణ పూజ కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి అమ్మవారికి అభిషేకం, కాళరాత్రి మహానవావరణ పూజల అనంతరం మహాకుంభం నివేదించారు. అనంతరం కలశోద్వాసనతో నవరాత్రి ఉత్సవాలను పూర్తిచేశారు. సర్వేపల్లి కొండూరు సుబ్బారెడ్డి మనుమడు మహీధర్‌రెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. వారితోపాటు వల్లూరు రవీంద్రారెడ్డి పెద్దకామాక్షమ్మ దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. శనివారం విజయదశమి సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక పోలీసు బందోబస్తు చర్యలు చేపడుతున్నట్టు ఆలయ ఈఓ ఏవీ. శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శనివారం రాత్రి శమీ పూజ అనంతరం అశ్వవాహనం గ్రామోత్సవం తరువాత ఆలయంలో స్వామిఅమ్మవార్ల ఏకాంతసేవతో దసరా ఉత్సవాలు ముగియనున్నాయి. అలాగే కోదండరామస్వామి, కనకదుర్గమ్మ, కళ్యాణ వేంకటేశ్వరస్వామి, కన్యకాపరమేశ్వరి, వేణుగోపాలస్వామి, దుర్గా మల్లేశ్వరస్వామి, రేబాలలో పుట్టాలమ్మతో పాటు అనేక ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

విడవలూరు/చిత్రగుంట: విశ్వనాథరావుపేట కోదండరామాలయంలోని రాజరాజేశ్వరి అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచారు. రామస్వామిపాలెం జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో వ్యవస్థాపకులు బత్తుల రవిచంద్ర భక్తులకు అన్నసంతర్పణ చేపట్టారు.

ఉదయగిరి రూరల్ : ఉదయగిరి పట్టణంలోని పార్వతీపరమేశ్వరాలయం, శ్రీసంతానలక్ష్మిదేవి ఆలయాల్లో అమ్మవారు శ్రీమహిషాసురమర్దినిదేవి, శ్రీమహాకాళిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

మహిషాసుర మర్దినిగా భువనేశ్వరి అమ్మవారు





మహిషాసురమర్దినిగా అష్టమహాలక్ష్మి



ధనలక్ష్మిగా కృష్ణమందిరం వైభవలక్ష్మి

అయిగిరినందిత మోహిని
మహిషాసురమర్దిని జయహే

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 11 : నగరంలో జరుగుతున్న దేవీ నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం 9వ రోజుకు చేరాయి. నవదుర్గల్లో 9వ అలంకారం మహిషాసుర మర్దిని గా అమ్మణ్ణులు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో మహర్నవమి, కన్య, సామూహిక కుంకుమ పూజలు, మధ్యాహ్నం అన్నదానాలు, రాత్రి కలశోద్వాసనలు, ఛండీ హోమాలు, పూర్ణాహుతులు జరిగాయి. భక్తులతో ఆలయాలు పోటెత్తాయి. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి, దర్గామిట్టలోని రాజరాజేశ్వరి, మూలాపేట, నవాబుపేటలోని శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయాల్లో ద్రౌపదీ దేవిలు, మూలస్థానేశ్వరాలయంలో భువనేశ్వరి, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో గాయత్రీదేవి, సుజాతమ్మకాలనీలోని అష్టలక్ష్మి ఆలయంలో లక్ష్మీదేవి, అయ్యప్పగుండి గురువాయురప్పన్ మహావిష్ణువు ఆలయంలో ఆదిలక్ష్మిలు మహిషాసుర మర్దినులుగా భక్తులను ఆశీర్వదించారు. స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకా పరమేశ్వరి గజలక్ష్మిగా, నెల్లూరు రూరల్‌లోని వేదగిరి క్షేత్రంలో ఆదిలక్ష్మి, మహాత్మాగాంధీనగర్ కృష్ణమందిరంలో వైభవలక్ష్ములు ధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు.



మహిషాసుర మర్దినిగా గాయత్రీదేవి



మహిషాసురమర్దినిగా ద్రౌపదీదేవి

మర్రి ఆకుపై సూక్ష్మ చిత్రంతో విజయదశమి శుభాకాంక్షలు



మర్రి ఆకుపై విజయ లక్ష్మి చిత్రం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 11 : జిల్లా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలను సూక్ష్మ కళాకారుడు తన కళాత్మక చిత్రం ద్వారా తెలియజేశారు. సుంకు చెంగన్న స్కూలులో తెలుగు ఉపాధ్యాయుడు గా పని చేస్తున్న గంథవళ్ల ఉమాశంకర్ మర్రి ఆకుపై సృజనాత్మకంగా విజయలక్ష్మి రంగుల అలంకారాన్ని కత్తిరించారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు

నెల్లూరు(సాంస్కృతికం): దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో విజయానికి గుర్తుగా బొమ్మల కొలువులను తీర్చిదిద్ది 9 రోజులు పూజలు, వ్రతాలు, నోములు చేస్తారు. ఆ కోవలోనే నెల్లూరు నగరంలో పొదలకూరు రోడ్డులో సంగీత కళాకారిణి హర్షవర్ధిని తన గృహంలో బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. 8రోజులుగా ముత్తైదువలను ఆహ్వానించి రోజు దుర్గాదేవికి పూజలు, పాటలు, భజనలు చేసి ప్రసాదాలు పంపిణీ చేశారు. శుక్రవారం బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, విశ్రాంత ఉపాధ్యాయిని ఉషాదేవి, తదితరులు పాల్గొని పూజలు చేసి వాయనాలు అందుకున్నారు.

వైభవంగా మహర్నవమి



అమ్మవారి పల్లకిసేవ చేస్తున్న భక్తులు

ముత్తుకూరు: బ్రహ్మ దేవంలోని కైలాసనా థేశ్వర స్వామి దేవ స్థానంలో శుక్రవారం మహర్నవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. మహిషాసుర మర్దిని అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను అలంకరించి కనుల పండువగా పల్లకీ సేవ నిర్వహించారు.

కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతం



మాట్లాడుతున్న డాక్టర్ సతీష్‌కుమార్, పక్కన ఇతర వైద్యులు

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 11 : నగరంలోని కిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో హెపటైటీస్ సి ఉన్న వ్యక్తికి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేసినట్లు కిమ్స్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ అఫీసర్ డాక్టర్ సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆసుపత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని సైదాపురంకు చెందిన బట్టా సురేష్ (32) హైపటైటిస్ సితో కిడ్నీలు చెడిపోవడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన కిడ్నీతో కిడ్నీ మార్పిడి చేశామన్నారు. చెన్నై, హైదరాబాద్ వంటి మహానగరాల్లో మాత్రమే నిర్వహించే ఈ శస్త్రచికిత్సను కిమ్స్ ఆసుపత్రిలో నిర్వహించామని చెప్పారు. ప్రముఖ కిడ్నీ మార్పిడి వైద్య నిపుణులు డాక్టర్ సన్నీష్‌రెడ్డి మాట్లాడుతూ హైపటైటిస్ సి ఉన్న వ్యక్తికి కిడ్నీ మార్పిడి చేయడం చాలా కష్టమన్నారు. ఇందుకు సహకరించిన ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరినాయుడుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెఫ్రాలజిస్ట్ డాక్టర్ సురేష్‌కుమార్, యూరాలజిస్ట్ డాక్టర్ సురేష్‌రెడ్డి, డాక్టర్ శేషయ్య, డాక్టర్ జగదీష్, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ మదన్‌మోహన్, డాక్టర్ శివమాల పాల్గొన్నారు.

చండీ సప్తపది పారాయణంతో అజ్ఞానం తొలగింపు



సన్మానం అందుకుంటున్న గిరిజాదేవి

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 11: దురాదేవిని ఉపనిషత్తులు, చండీ సప్తపది పారాయణం చేసిన వారికి జ్ఞానోదయం అవుతుందని తద్వారా ప్రశాంత జీవనం కలుగుతుందని విశ్రాంత తెలుగు లెక్చరర్ డాక్టర్ గిరిజాలక్ష్మి తెలిపారు. నగరం లోని మూలాపేట సరస్వతీ సమాజం ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం దుర్గాపరాశక్తిపై ప్రవచనం చేసిన ఆమెను నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీ.సుభద్రాదేవి, సమాజం అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలపై ప్రజలకు అవగాహన

తోటపల్లిగూడూరు, అక్టోబరు 11 : జనంలోకి మనం కార్యక్ర మంలో భాగంగా సౌత్ ఆములూరు గ్రామంలో శుక్రవారం పోస్టల్ సేవలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నెల్లూరు రూరల్ సబ్‌డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ శ్రీనివా సులు పాల్గొని మాట్లాడుతూ పోస్టల్ శాఖలో అమలుచేస్తున్న పథకాలను వివరించి వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ గ్రామ పోస్ట్‌మాస్టర్ సత్య, సుజిత తదితరులు పాల్గొన్నారు.



మాతమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

ఇరిగేషన్ మాటున రూ.150 కోట్లకుపైగా మెక్కేశారు!

- ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

వెంకటాచలం, అక్టోబరు 11 : సర్వేపల్లి నియోజకవర్గంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గత వైసీపీ ప్రభుత్వంలో ఇరిగేషన్ పనులు చేయకుండానే రూ.150 కోట్లకుపైగా మెక్కేశారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని ఇస్కపాళెంలో మాతమ్మ దేవాలయాన్ని శుక్రవారం సాయంత్రం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంట కాలువల్లో పూడికతీత పనులు చేయకుండా మాజీ మంత్రి కాకాణి గాలికి వదిలేశాడని ఆరోపించారు. గత వైసీపీ పాలకులు జిల్లాలో మొదటి పంటకు సాగునీరు లేకుండా చేయడం వల్ల రైతులు 3 లక్షల ఎకరాలకుపైగా బీడు పెట్టాశారన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి ఉండదని, రైతు బిడ్డలను భాగస్వాములను చేసుకొని మరీ కాలువల్లో పూడికతీత పనులు పూర్తి చేస్తామన్నారు. కనుపూరు, డేగపూడి, బండే పల్లి కాలువల అభివృద్ధికి కృషి చేస్తామ న్నారు. కార్యక్రమంలో బొమ్మి సురేంద్ర, రావూరి రాధాకృష్ణమనాయుడు, కుంచి శ్రీనివాసులు యాదవ్, జెన్ని రమణయ్య, బాబుల్‌రెడ్డి, సురేష్, నరేష్, శ్రీనితరెడ్డి, సునీల్, శివశంకర్, సాయి తదితరులున్నారు.

పర్యావరణ రక్షణకు మొక్కలు నాటాలి

కావలి, అక్టోబరు 11: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని సంయుక్త సేవా సంస్థ బాధ్యులు గంగపట్ల సురేంద్ర, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రఘురామిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆ సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటి మాట్లాడారు. గత ఏడాది 1600 మొక్కలు నాటామని ఈ ఏడాది పూలు, పండ్లు, ప్రజలకు నీడనిచ్చే 2వేల మొక్కలను నాటడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, జానకి రాం పాల్గొన్నారు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
విజయ దశమి శుభాకాంక్షలు
తిరుపతి




శనివారం | 12-10-2024 | పేజీలు: 10 + 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 284 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: నవమి ఉ. 10.59 తదుపరి దశమి; నక్షత్రం: శ్రవణం తె. 4.25 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: ఉ. 9.15 -10.47; దుర్ముహూర్తం: ఉ. 6.11-7.44; అమృతఘడియలు: రా. 6.28-8.00; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.11; సూర్యాస్తమయం: 5.51 | తిరుపతి

Nellore | Tirupathi | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

హారథంపై మహామూర్తి

కల్కిగా రాత్రి అశ్వవాహనంపై శ్రీవారి దర్శనం

నేటి చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు పూర్తి

భక్తి శ్రద్ధలతో భక్తులు తాళ్లతో లాగుతుండగా, మహారథంపై దేవేరులతో కలిసి నాలుగు మాడవీధుల్లో మలయప్పస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు మొదలైన రథోత్సవం.. 9.35 గంటల వరకు సాగింది. ఇక, రాత్రి బ్రహ్మోత్సవాల్లో చివరి వాహనమైన అశ్వవాహనంపై మలయప్పస్వామి కల్కి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చివరిదైన ఈ వాహన సేవకు భక్తులు తరలిరావడంతో గ్యాలరీలన్నీ నిండిపోయాయి. శనివారం ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తవుతాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




భారీ భక్తజన సందోహం మధ్యన మహారథంపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి

చక్రస్నానానికి ఏర్పాట్లు పూర్తి

తిరుమల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో చివరిరోజైన శనివారం జరగనున్న చక్రస్నానానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు వరాహస్వామి ఆలయం వద్ద పుష్కరిణిలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వా



మికి, చక్రత్తాళ్వార్‌కు స్నపనతిరుమంజనం, ఆ తర్వాత చక్రస్నానం నిర్వహిస్తారు. దీనికోసం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పుష్కరిణిలో గ్యాలరీలు, స్నానఘట్టాలు ఏర్పాటు చేశారు. భద్రతాపరంగా ఇబ్బందులు లేకుండా టీటీడీ భద్రతా సిబ్బందితో పాటు ఎస్పీఎఫ్ సిబ్బంది, ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. చక్రస్నానం పవిత్రత రోజంతా ఉంటుందని, భక్తులు సంయమనం పాటించి పుష్కరిణిలో స్నానం చేయాలని టీటీడీ కోరింది. భక్తులు దుస్తులు మార్చుకునేందుకు కూడా ఏర్పాట్లు చేశారు. ఇక, శ్రీవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించే వరాహస్వామి ఆలయ ప్రాంగణంలో 1,200 కిలోల పుష్పాలు, 10 వేల కట్‌ఫ్లవర్స్‌తో అలంకరణలు చేపట్టారు.

తుది ఘట్టాన్నీ విజయవంతం చేద్దాం



శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన చక్రస్నానం ఘట్టాన్నీ విజయవంతం చేద్దామని టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. శనివారం ఉదయం జరగనున్న చక్రస్నానం ఏర్పాట్లపై శుక్రవారం ఆయన తిరుమలలోని బ్రహ్మోత్సవం సెల్‌లో అధికారులతో సమీక్షించారు. పుష్కరిణిలో అన్ని ప్రవేశ, నిష్క్రమణ పాయింట్లు, పురుషులు, మహిళలు దుస్తులు మార్చుకునే గదులు తదితర ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పుణ్యస్నానాలు ఆచరించాలని సూచించారు. పుష్కరిణి సామర్థ్యం చాలా తక్కువగా ఉన్నందున క్రౌడ్ మేనేజ్‌మెంట్‌లో పోలీసులతో సమన్వయం చేసుకుని పని చేయాలని సీవీఎస్వోను ఆదేశించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి మాట్లాడుతూ.. పుష్కరిణిలో లోపల స్థలం పరిమితంగా ఉండటంతో భక్తుల భద్రతను దృష్టిలో పెట్టుకుని మరింత జాగ్రత్తగా పనిచేయాలన్నారు. పుష్కరిణిలో ప్రతి 20 మీటర్ల దూరానికి ఒక ఈతగాడిని, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు 40 లైఫ్ జాకెట్లు ఏర్పాటు చేసినట్టు సీవీఎస్వో శ్రీధర్ వివరించారు. జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాకు భారీ వర్షసూచన

- 14 నుంచి 16 వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 11: రాబోయే మూడు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ క్రమంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండి ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం ఆదేశించారు. ఈ నెల 14 నుంచి 16 వరకు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని కాబట్టి గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి అధికారుల వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బియ్యం, కందిపప్పు తదితరాలు తగినంత స్టాక్ అందుబాటులో ఉండేల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్‌శాఖ వారు జనరేటర్లను అందుబాటులో ఉండేలా, శిథిలావస్థ భవనాలు, పూరిగుడిసెల్లో ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలను అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

నోటిఫికేషన్

నెం.I/డిసిల్టింగ్/తేది: 11-10-2024

డి.పి.సి. తిరుపతి జిల్లా వారు 1. పెళ్లకూరు మండలము, పుల్లూరు గ్రామము పాలచూర్ ఆనికట్ అప్ స్ట్రీమ్, 2. పెళ్లకూరు మండలము, దిగువచెలకూరు గ్రామము పాలచూర్ ఆనికట్ డౌన్ స్ట్రీమ్ మరియు 3. కోట మండలము, గూడలి గ్రామము స్వర్ణముఖి బ్యారేజ్ వద్ద డీసిల్టేషన్ (1.920 హెక్టర్స్, 1.821 హెక్టర్స్ మరియు 2.300 హెక్టర్స్ ఏరియా) కోసము ఆసక్తిగల సంస్థల నుండి APPCB నుండి స్వీకరించిన సమ్మతి మేరకు CTE ఆర్డర్ 1. TPT-112/APPCB/ZO-TPT/CTE/2024 -398, Dt. 30-09-2024, 2. TPT - 113/APPCB/ZO-TPT/CTE/2024-397, Dt. 30-09-2024 3. TPT - 111/APPCB/ZO-TPT/CTE/2024-399, Dt. 30-09-2024 మరియు CTO ఆర్డర్ నెం.1. TPT-112/APPCB/ZO-TPT/CTO/2024-404, Dt: 07-10-2024, 2. TPT-113/APPCB/ZO-TPT/CTO/2024 -405, Dt.07-10-2024, 3. TPT-111/APPCB/ZO-TPT/CTO/2024-403, Dt.07-10-2024, దరఖాస్తులు కోరింది. మానవశక్తి ద్వారా డిసిల్టింగ్ మరియు సమీపములోని నిర్దేశిత డంపింగ్ పాయింట్‌కు ఉపయోగకరమైన మెటీరియల్‌ను రవాణా చేయడానికి అయ్యే ఖర్చు ఒక మెట్రిక్ టన్నుకు గాను రూ॥ 185/- (పన్నులు అదనం)గా నిర్ణయించబడియున్నది. కావున ఆసక్తిగల సంస్థలు, సొసైటీలు మరియు వ్యక్తులు తమ ఆసక్తి లేఖను తేది: 12-10-2024 నుండి 14-10-2024న సాయంత్రము 5.00 లోపు కార్యనిర్వాహక ఇంజనీరు, నెల్లూరు దక్షిణ విభాగము, గూడూరు, తిరుపతి జిల్లా నందు సమర్పించగలరు. ఈ నోటిఫికేషన్‌ను జారీ చేసే అధికార యంత్రాంగానికి ఈ నోటిఫికేషన్ వాయిదా వేయడానికి లేదా రద్దు చేయడానికి పూర్తి అధికారాలు ఉంటాయి.

సం/- జిల్లా కలెక్టర్, తిరుపతి జిల్లా





బ్రహ్మోత్సవాల్లో ఆర్టీసీకి రూ.6.81కోట్ల రాబడి

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 11: శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు రికార్డుస్థాయిలో భక్తులు ఆర్టీసీ బస్సుల ద్వారా తిరుమల కొండకు రాకపోకలు సాగించారు. ఈ మేరకు ఉత్సవాల ఏడు రోజులకుగాను 404 బస్సులు తిరుపతి నుంచి తిరుమలకు 13,566ట్రిప్పులతో 3,68,626మంది.. తిరుమల నుంచి తిరుపతికి 13,633ట్రిప్పులలో 4,82,189మంది ప్రయాణించారు. మొత్తం 8,50,815మంది రాకపోకలు సాగించారు. ఈ క్రమంలో రాబడి కూడా దాదాపు రూ.6.81కోట్లు సమకూరింది.

శ్రీకాళహస్తి, చంద్రగిరి, సూళ్లూరుపేటల్లో

మద్యం సిండికేట్లు!

- సగటున ఒక దుకాణానికి 5 నుంచి 9 దరఖాస్తులే
- అధికార పార్టీ నేతల జోక్యమే కారణం
- శ్రీకాళహస్తిలో 12 దుకాణాలకు 112 అప్లికేషన్లే
- ఓజిలిలో రెండింటికి 50 మంది పోటీ
- తిరుపతిలో పోటాపోటీగా..

జిల్లాలో మద్యం దుకాణాల దరఖాస్తులను పరిశీలిస్తే శ్రీకాళహస్తి, చంద్రగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల పరిధిలో సిండికేట్లు చక్రం తిప్పినట్టు స్పష్టంగా వెల్లడవుతోంది. ఈ మూడు నియోజకవర్గాల్లో మద్యం దుకాణానికి సగటున ఐదు నుంచి తొమ్మిది దరఖాస్తులే వచ్చాయి. అధికార పార్టీ నేతల జోక్యమే ఈ పరిస్థితికి కారణమని తెలుస్తోంది. తిరుపతి అర్బన్, రూరల్ మండలాల్లో మాత్రం పోటాపోటీగా దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 227 మద్యం దుకాణాలకు 3701 దరఖాస్తులు అందాయి.

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అధికార పార్టీ ముఖ్యనేత జోక్యంతో మద్యం షాపులకు దరఖాస్తుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. శ్రీకాళహస్తి పట్టణంలో 12 షాపులకు గానూ 112 దరఖాస్తులే వచ్చాయి. అంటే సగటున షాపునకు 9 దరఖాస్తులు వచ్చినట్టు లెక్క. అలాగే తొట్టంబేడు మండలంలో మూడు షాపులకు 16 వచ్చాయి. ఒకో షాపు కోసం కనీసం పది చొప్పున దరఖాస్తులు రావాలి. కానీ ఐదు చొప్పునే వచ్చాయి. ఏర్పేడు మండలంలో ఏడింటికి 44 దరఖాస్తులు వచ్చాయి. సగటున 6 వచ్చినట్టు లెక్క. ఇక, జిల్లాలోని ఓజిలి చాలా చిన్న మండలం. ఈ మండలంలో రెండు షాపులుంటే 50 దరఖాస్తులు వచ్చాయి. అంటే సగటున 25 దరఖాస్తులు. ఈ చిన్న మండలంలోనే ఇన్ని దరఖాస్తులు వస్తే శ్రీకాళహస్తి వంటి పెద్ద పట్టణంలో సగటున 9 దరఖాస్తులు రావడం గమనార్హం. అధికార పార్టీకి చెందిన ముఖ్యనేత సిండికేట్ ఏర్పరిచినట్టు సమాచారం. డిప్‌లో కూడా తాను చెప్పిన వారికే షాపులు ఇవ్వాలని లేదంటే సస్పెండ్ చేయిస్తానని అధికారులను బెదిరిస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

- చంద్రగిరి నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది. చంద్రగిరి మండలంలో 7 షాపులకు 81 దరఖాస్తులు అందాయి. దుకాణానికి సగటున 12 దరఖాస్తులు. పాకాల మండలంలో 5 షాపులకు 28 దరఖాస్తులు వచ్చాయి. సగటున 6 దరఖాస్తులు. చిన్నగొట్టిగల్లు మండలంలో 3 షాపులుంటే సగటున 9 లెక్కన మొత్తం 28 దరఖాస్తులే వచ్చాయి. రామచంద్రాపురం మండలంలో 4 షాపులుండగా సగటున 8 చొప్పున 33 దరఖాస్తులు అందాయి. జాతీయ రహదారుల కనెక్టివిటీ వున్న ఈ మండలాల్లో సగటు దరఖాస్తుల సంఖ్య ఇలా వుంటే మారుమూల అటవీ ప్రాంతమైన ఎర్రావారిపాలెం మండలంలో మాత్రం రెండు షాపులకు గానూ 21 దరఖాస్తులు వచ్చాయి. మిగిలిన మండలాల కంటే కూడా ఎక్కువగా సగటున 11 దరఖాస్తులు రావడం గమనార్హం. చంద్రగిరి పరిధిలో ఒక్క తిరుపతి రూరల్ మండలంలోనే భారీగా దరఖాస్తులు వేశారు. ఈ నియోజకవర్గంలో అధికార పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు ముఖ్యనేత పేరు చెప్పి దరఖాస్తుదారులను బెదిరించారనే ప్రచారం జరుగుతోంది. దరఖాస్తుల సంఖ్య తగ్గడం ఆ ప్రచారానికి ఊతమిస్తోంది.

- సూళ్లూరుపేట నియోజకవర్గం విషయానికొస్తే నాయుడుపేట పట్టణంలో 13 మద్యం షాపులుంటే సగటున 8 చొప్పున మొత్తం 105 అప్లికేషన్లు వచ్చాయి. సూళ్లూరుపేట పట్టణంలో 14 దుకాణాలుండగా సగటున 8 వంతున 114 దరఖాస్తులు వచ్చాయి. ఈ రెండు మండలాల్లో అధికార పార్టీ కీలక నేత కుటుంబీకుల జోక్యంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని సమాచారం. అయితే మిగిలిన ఓజిలి, పెళ్ళకూరు, దొరవారి సత్రం, తడ తదితర నాలుగు మండలాల్లో మాత్రం ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు సమర్పించారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

జిల్లా వ్యాప్తంగా దాఖలైన దరఖాస్తులు వివరాలు

మండలం	దుకాణాలు	దరఖాస్తులు
తిరుపతి అర్బన్	32	972
తిరుపతి రూరల్	12	387
రేణిగుంటలో	10	137
శ్రీకాళహస్తి	12	112
బుచ్చినాయుడు కండ్రిగ	5	62
కేవీబీ పురంలో	3	49
తొట్టంబేడు	3	16
ఏర్పేడు	7	44
నాగలాపురం	4	51
పిచ్చాటూరులో	3	43
సత్యవేడులో	10	120
వరదయ్యపాళెం	5	78
పుత్తూరు	7	78
నారాయణవనం	3	51
రామచంద్రాపురం	4	33
వడమాలపేట	4	68
చంద్రగిరిలో	7	81
పాకాల	5	28
చిన్నగొట్టిగల్లు	3	28
ఎర్రావారిపాల్లెం	2	21
గూడూరు	12	146
చిల్లకూరు	6	54
నాయుడుపేట	13	105
ఓజిలి	2	50
పెల్లకూరు	2	44
సూళ్ళూరుపేట	14	114
దొరవారి సత్రం	2	32
తడ	5	125
వాకాడు	4	66
చిట్టమూరు	4	61
కోట	7	119
వెంకటగిరి	9	175
బాలాయపల్లి	3	79
డక్కిలి	3	72

తిరుపతి అర్బన్, రూరల్‌లో పోటాపోటీగా..

తిరుపతి అర్బన్, రూరల్ మండలాల్లో పోటాపోటీగా మద్యం షాపులకు దరఖాస్తులు చేశారు. తిరుపతి రూరల్ మండలంలో 12 షాపులకు 387 వచ్చాయి. ఒకో షాపునకు సగటున 32 దరఖాస్తులు వచ్చాయి. తిరుపతి అర్బన్ విషయానికొస్తే మొత్తం 32 దుకాణాలకు గానూ 972 దరఖాస్తులు చేశారు. ఆ ప్రకారం చూస్తే దుకాణానికి సగటున 30 దరఖాస్తులు వచ్చాయి. మరికొన్ని మండలాల్లో కూడా ఈ తరహా పరిస్థితి కనిపించింది. బాలాయపల్లి మండలంలో 26, తడ మండలంలో 25, ఓజిలి మండలంలో 25, డక్కిలి మండలంలో 24 చొప్పున ఒక్కో షాపునకు సగటు దరఖాస్తులు అందాయి.

కిక్కు.. ఎవరికో!

- మద్యం దుకాణాలకు ముగిసిన టెండర్లు
- 227 దుకాణాలు.. 3701 దరఖాస్తులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 11: జిల్లాలో మద్యం దుకాణాలకు శుక్రవారం రాత్రితో దరఖాస్తుల పర్వం ముగిసింది. 227 దుకాణాలకు 3701 దరఖాస్తులు అందాయి. సగటున ఒక దుకాణానికి ఐదు నుంచి 25 దరఖాస్తులు అందాయి. వీటికి కట్టిన డిపాజిట్ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ 74.02 కోట్లు సమకూరింది. ఇక, డిపాజిట్లు కట్టిన దరఖాస్తుదారుల్లో 'లక్కు' ఎవరిని వరించనుందనేది ఈనెల 14వ తేదీన తేలనుంది. ఆ రోజున తిరుపతిలో లాటరీ ద్వారా దుకాణాలను కేటాయించనున్నారు. కాగా, అత్యధికంగా తిరుపతి అర్బన్‌లో 32 దుకాణాలకు 972.. అత్యల్పంగా తొట్టంబేడు మండలంలో మూడు దుకాణాలకు 16 దరఖాస్తులు మాత్రమే దాఖలయ్యాయి. తిరుపతి అర్బన్, రూరల్‌తో పాటు కొన్ని చోట్ల పోటాపోటీగా దరఖాస్తులు దాఖలవగా.. మరి కొన్నిచోట్ల తగ్గాయి. చివరి రోజున సాయంత్రం వరకు క్యూలో ఉన్న వారి వద్ద ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే వారికి మాత్రం ఏడు గంటల వరకు గడువు విధించింది. అందుకు సంబంధించి దరఖాస్తు రుసుము మాత్రం అర్ధరాత్రి 12 గంటల్లోగా చెల్లించాల్సి ఉంటుంది. నిర్దేశించిన విధానంలో మాత్రం రుసుము చేరే విధంగా చర్యలు తీసుకోవాలి. లేకుంటే ఆ దరఖాస్తు చెల్లుబాటు అయ్యే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు.




దసరా వచ్చిందయ్యా..!

తిరుపతి నగరంలో శుక్రవారమే దసరా సందడి నెలకొంది. శనివారం విజయదశమి సందర్భంగా నగరంలో బూడిద గుమ్మడి కాయలు, మామిడి, అరటి మండలు, పూలు, పండ్లు, స్వీట్స్ తదితర పూజా సామగ్రిని కొనుగోలు చేశారు.

అందరికీ విజయదశమి శుభాకాంక్షలు

తిరుపతి(కలెక్టరేట్/నేరవిభాగం), అక్టోబరు 11: విజయదశమి సందర్భంగా జిల్లా ప్రజలకు కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ చేపట్టే పనులన్నీ విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్ కూడా విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

మందు రేటు పెంచతారా?

- దుకాణం మూసివేసి మందుబాబుల నిరసన

వరదయ్యపాళెం, అక్టోబరు 11: వరదయ్యపాళెం మండలం గోవర్ధనపురంలోని మద్యం దుకాణ నిర్వాహకులు శుక్రవారం అధిక ధరలకు విక్రయించారు. క్వార్టర్ బాటిల్ రూ.150 ఉండగా రూ.160 చొప్పున విక్రయించారు. దీనిపై మందుబాబులు ప్రశ్నించడంతో నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీంతో ఆగ్రహించిన మందు బాబులు దుకాణాన్ని మూతవేయించారు. మద్యాన్ని అధిక ధరలకు ఎందుకు విక్రయిస్తున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వడమాలపేట: వడమాలపేటలోని మద్యం దుకాణాల్లో క్వార్టర్ బాటిల్‌పై ఎంఆర్‌పీ కన్నా రూ.10 అదనంగా అమ్ముతున్నారని మందుబాబులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలకు నాలుగు రోజుల గడువే ఉండటంతో.. కౌంటర్లలోని వారు రేట్లు పెంచి అమ్ముతున్నారు. పుత్తూరు ఎక్సైజ్ సీఐని వివరణ కోరగా.. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

శ్రీహరికి కళానీరాజనం



బ్రహ్మోత్సవాల్లో చివరి వాహనమైన అశ్వవాహనసేవలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 20 కళాబృందాల ద్వారా 528 మంది కళాకారులు తమ ప్రదర్శనలతో గోవిందుడికి కళానీరాజనాన్ని సమర్పించారు. ఇందులో.. తిరుపతి ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థుల భరతనాట్యం, కూచిపూడి నృత్యం, కార్తిక్ నాయక్ బృందం భరతనాట్యం, వెంకటకృష్ణ బృందం(తెలంగాణ) జానపద నృత్యం, మనీష బృందం(శ్రీకాకుళం) బంగ్రా నృత్యం, వెంకటరమణ బృందం(మదనపల్లి) పిల్లనగ్రోవి, తల్కావతి బృందం(తమిళనాడు) భరతనాట్యం, మయాంక్ తివారీ బృందం(రాజస్థాన్) దాండియా నృత్యం, రూప్‌సింగ్ బృందం మట్కి కళావిశేషం, వాజిరాజ్ బృందం(మంత్రాలయం) భజన సంకీర్తన, రోహిణికుమార్ బృందం(రాజమండ్రి) డప్పు విన్యాసాలు అలరించాయి. ఇక, లక్ష్మీ బృందం(పశ్చిమగోదావరి) కోలాటం, మల్లిఖార్జున(రాయచోటి), ప్రసన్నకుమారి(తిరుపతి), శ్రీనివాసులు(తిరుమల), అలేఖ్య(కావలి) బృందాల కోలాటాలు గ్యాలరీల్లోని భక్తులను ఉత్తేజపరిచాయి. మురళీకృష్ణ బృందం(తిరుపతి) ప్రదర్శించిన దశావతారాల రూపకం భక్తులను పరవశింపచేసింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




దసరా
శుభాకాంక్షలు
అమరావతి రూపశిల్పి, స్వర్ణాంధ్రప్రదేశ్ సృష్టికర్త,
కార్యదీక్షపరులు, ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి కోసం
అహర్నిశలు శ్రమిస్తున్న
మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
గా.శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
మరియు వెంకటగిరి, సూళ్ళూరుపేట, గూడూరు
టిడిపి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు
దసరా మరియు దీపావళి శుభాకాంక్షలు...
కురుగొండ్ల
రామకృష్ణ
ఎమ్మెల్యే, వెంకటగిరి
పాశిం
సునీల్‌కుమార్
ఎమ్మెల్యే, గూడూరు
శ్రీమతి నెలవల
విజయశ్రీ
ఎమ్మెల్యే, సూళ్ళూరుపేట

ఇసుక నిల్వలపై సబ్‌కలెక్టర్ ఆరా


ఇసుక నిల్వలపై అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

కోట, అక్టోబరు 11: కోట మండలం గూడలి స్వర్ణముఖినదిలో ఇసుక నిల్వలు, భూగర్భజలాల సామర్థ్యంపై శుక్రవారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా ఆరా తీశారు. తహసీల్దారు జయజయరావు, సర్వేయర్లతో కలిసి సబ్ కలెక్టర్ నది లోతట్టు భాగాన్ని పరిశీలించారు. గూడలి స్వర్ణముఖి నదిలో ప్రభుత్వ ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో నదిలో సీసీ కెమెరాల ఏర్పాటు, డంపింగ్ యార్డ్‌కు స్థల పరిశీలన, తదితర అంశాలపై సబ్‌కలెక్టర్ పరిశీలించారు. నదిలోని గూడలి, నాయుడుపేట మార్గం మీద వెళ్లే వంతెన నుంచి చిట్టమూరు మండల సరిహద్దు వంటి మెట్టు వరకు నది లోతట్టు భాగాన్ని సబ్ కలెక్టర్ పరిశీలించారు.

కష్టపడేవారికి సముచిత స్థానం: సీపీఎం

నాయుడుపేట, అక్టోబరు 11: పార్టీలో కష్టపడే కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం సమావేశం జరిగింది. సీపీఎం పట్టణ కార్యదర్శిగా మహేష్‌బాబును ఎంపిక చేసినట్లు ఆయన ప్రకటించారు. పుల్లయ్య, ముకుంద, శంకర్, పద్మమ్మ, శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.


సూళ్లూరుపేట: రాజరాజేశ్వరి అలంకరణలో చెంగాళమ్మ


వెంకటగిరి: శయన అలంకారంలో కన్యకాపరమేశ్వరి


కోట: గూడలిలో బిందె కలశాలతో గ్రామోత్సవం


గూడూరు: మహిషాసురమర్ధినిగా విజయదుర్గాదేవి, నారాయణమ్మ, లక్ష్మీదేవి అలంకరణలో మహాలక్ష్మీదేవి, విజయలక్ష్మీదేవిగా గంగమ్మ

వివిధ అలంకారాల్లో అమ్మవారి అనుగ్రహం

గూడూరు, అక్టోబరు 11: దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పలు ఆలయాల్లో అమ్మవార్లు వివిధ అలంకరణలు భక్తులను దర్శనమిచ్చారు. స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో అమ్మవారిని, నారాయణమ్మ పేరంటాళ్ల ఆలయంలో అమ్మవారిని, ధర్మరాజస్వామి ఆలయంలో ద్రౌపదిదేవిని, రాజరాజేశ్వరి దేవి ఆలయంలో అమ్మవార్లను మహిషాసురమర్ధిని అలంకారంలో, గంగమ్మ ఆలయంలో అమ్మవారిని విజయలక్ష్మీదేవిగా, కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని చాముండేశ్వరిదేవిగా, బజారు కలశంలో అమ్మవారిని ఆదిపరాశక్తి అలంకరించి పూజలు నిర్వహించారు.

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మను ఉదయం ముత్యాలచీర అలంకారంలో ఉంచి పూజలు జరిపారు. రాత్రికి మహిషాసురమర్ధినిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి అర్ధరథంపై గ్రామోత్సవం జరిపారు. కలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మీ దేవిని ధనలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేశారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి మాతకు శయన అలంకారం, హరహర క్షేత్రంలోని కాత్యాయనీ దేవికి మహిషాసుర మర్ధినిగా, వెంకటేశ్వర స్వామికి శ్రీకృష్ణావతారంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ముందుగా ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని మూకాంబికా దేవిని మహిషాసురమర్ధిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే పోలేరమ్మ, మానసా దేవి, దుర్గమ్మ, కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో శరన్నవరాత్రి మహోత్సవాలు పూజలు జరిగాయి.

కోట: పట్టణంలోని గ్రామదేవత కోటమ్మను కూరగాయలతో అలంకరించి పూజలు చేశారు. అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించారు. అదే విధంగా గూడలిలో రామలింగచాముండేశ్వరిని మహిషాసుర మర్ధినిగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు బిందె కలశాలతో గూడలి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

సూళ్లూరుపేట: చెంగాళమ్మ పరమేశ్వరి రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి అభిషేకం అనంతరం విశేష పూజలు చేశారు. మహాచండీయాగం నిర్వహించారు. అమ్మవారికి పోలీసుశాఖ నుంచి సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు సారె సమర్పించారు. ఉభయకర్తలుగా ముద్దలూరు మురళీకృష్ణమరాజు, అనిత, అట్రంబాక దొరబాబు రెడ్డి, సుహాసిని దంపతులు వ్యవహరించారు. సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి, టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, మాధవ నాయుడు పాల్గొన్నారు.


కోట: కూరగాయల అలంకారంలో కోటమ్మ, మహిషాసురమర్ధినిగా రామలింగచాముండేశ్వరి - వెంకటగిరి: దుర్గాదేవిగా కాత్యాయనీదేవి - చిల్లకూరు: ముత్యాలచీరలో ముత్యాలమ్మ, ధనలక్ష్మీదేవిగా ఆదిలక్ష్మీదేవి

కుమ్మరిపాళెంలో విషాదం


హత్యకు గురైన వనజ(ఫైల్‌ఫొటో), నిందితుడు సురేష్

చిట్టమూరు, అక్టోబర్ 11: మాంబట్టు సెజ్ అపాచీ బూట్ల పరిశ్రమలో పనిచేసే ఎర్రబోతు వనజ(30) హత్యకు గురవడంతో ఆమె స్వగ్రామమైన చిట్టమూరు మండలం కుమ్మరిపాళెంలో విషాదం నెలకొంది. బంధువుల కథనం మేరకు... గ్రామానికి చెందిన గొంజి వనజ, వెంకటాద్రి దంపతులు అపాచీ పరిశ్రమలో పనిచేస్తున్నారు. ఇదే గ్రామానికి చెందిన మీజూరు సురేష్ కూడా అదే పరిశ్రమలో పనిచేస్తున్నాడు. వనజను తరచూ వేధిస్తుండంతో చిట్టమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సురేష్‌పై 2019లో ఒకసారి, 2021లో మరోసారి రెండు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం విధులకు హాజరైన వనజ మధ్యాహ్న సమయంలో క్యాంటీన్‌లో భోజనం చేసేందుకు వెళ్లగా అక్కడ సురేష్ వ్యంగంగా మాట్లాడుతూ వేధించాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ దిగింది. సాయంత్రం 4 గంటల సమయంలో సురేష్ పదునైన కత్తెర తీసుకొని వనజ పనిచేసే ప్రదేశానికి వెళ్లి ఆమె మెడ వెనుకభాగంలో పొడవడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. అక్కడున్న కార్మికులు వనజను సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలింగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. హంతకుడు సురేష్ పారిపోతుండగా పరిశ్రమ సెక్యూరిటీ సిబ్బంది పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతురాలికి ఇద్దరు మగ పిల్లలున్నారు.

గూడూరు - తిరుమల బస్సు సర్వీసుల పునరుద్ధరణకు కృషి: పాశం


బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం

గూడూరు, అక్టోబరు 11: గూడూరు - తిరుమలకు బస్సు సర్వీసులను పునరుద్ధరించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోలో గూడూరు నుంచి పొదలకూరుకు మూడు బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గూడూరు నుంచి తిరుమలకు బస్సు సర్వీసులు నడుస్తుండడంతో ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేదన్నారు. ప్రధానంగా గూడూరు రైల్వేజంక్షన్ కావడంతో ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు గూడూరుకు చేరుకుని బస్సుల ద్వారా తిరుమలకు వెళ్లేవారన్నారు. గత వైసీపీ పాలనలో ఈ సరీసులను రద్దు చేయడం దారుణమన్నారు. సంబంధిత శాఖ అధికారులతో చర్చించి బస్సు సర్వీసులను పునరుద్ధరించేలా కృషి చేస్తానన్నారు. అలాగే గూడూరు డిపోలో బస్సుల సంఖ్య పెంచేందుకు చొరవ చూపుతానన్నారు. త్వరలోనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, జహంగీర్, నాగేశ్వరరావు, సిద్దయ్యనాయుడు, గుండాల లీలావతి, పెంచలయ్య, భారతి, శ్రీదేవి, సామిశెట్టి చెంచురామయ్య, జనార్దనరెడ్డి, ఆర్టీసీ డీఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్ ఏర్పాటుకు స్థల పరిశీలన


స్వర్ణముఖి నది వద్ద రీచ్ ఏర్పాటుకు స్థల పరిశీలిస్తున్న అధికారులు

పెళ్లకూరు, అక్టోబరు 11: మండలంలోని కలవకూరు వద్ద స్వర్ణముఖినదిలో కొత్తగా ఇసుక రీచ్ ఏర్పాటు కోసం సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, స్థానిక తహసీల్దార్ ద్వారకానాథరెడ్డితో పాటు మైనింగ్, ఇరిగేషన్ అధికారులతో కలసి శుక్రవారం పరిశీలించారు. మండలానికి సంబంధించి ఇక్కడ రీచ్ ఏర్పాటు కానుండడంతో ఎంతమేర ఇసుక లభ్యమయ్యే అవకాశం ఉందని ఆర్డీవో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా తవ్విన ఇసుకను డంప్ చేయడం, రవాణా సౌకర్యం తదితర విషయాలను పరిశీలించారు. అదే విధంగా కలవకూరు కాజ్‌వేకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా దూరం పాటించాలని, అదే సమయంలో సమీపంలోని తాగు, సాగునీటి కోసం ఏర్పాటు చేసుకున్న మోటార్లను పరిశీలించి నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రావు, మండల సర్వేయర్ పూజిత, సచివాలయ సర్వేయర్లు సూర్యనారాయణ, లక్ష్మణ్, శ్రీను, వీఆర్వో వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సత్కారం



వెంకటగిరి, అక్టోబరు 11: కరగ్‌పూర్ ఐఐటీలో సీటు సాధించిన ఆర్టీసీ కండక్టర్ పొన్నా వాసు కుమారుడు సాయినితీష్‌ను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సత్కరించారు.

ఆర్టీసీకి పూర్వవైభవం తీసుకువస్తా: కురుగొండ్ల

వెంకటగిరి, అక్టోబరు 11: ఆర్టీసీకి పూర్వవైభవం తీసుకు వచ్చి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం డిపోలో వెంకటగిరి - చెన్నై, వెంకటగిరి - తిరుపతి, వెంకటగిరి - నెల్లూరు బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు ప్రజల సంక్షేమాన్ని విస్మరించి ప్రజా ధనాన్ని దోచుకొనే పనిలో నిమగ్నమయ్యారని ఆరోపించారు. వెంకటగిరి డిపో నుంచి అన్ని మార్గాల్లో నూతన సర్వీసులకు ప్రారంభించి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రామకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ శివాజీ, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ప్రభాకర్, యూనియన్ నాయకులు కేవీ రత్నం, నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, పునుగోటి విశ్వనాధనాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు, మధునాయుడు, తోట రామచంద్రయ్య ఏలేశ్వరం రామచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, అక్టోబరు 11: నాగేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు విజయలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అమ్మవారిని దర్శించుకొన్నారు.



గూడూరులో పండుగ సందడి


పూల దుకాణం వద్ద రద్దీ

గూడూరు, అక్టోబరు 11: గూడూరు పట్టణంలో శుక్రవారం పండుగ సందడి నెలకొంది. శనివారం విజయదశమి సందర్భంగా అమ్మవారికి, వాహనాలకు పూజలు జరిపేందుకు అవసరమైన పూజాసామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలతో ప్రధాన కూడళ్లు రద్దీగా మారాయి. గుమ్మడి కాయలు, టెంకాయలు, బొరుగులు, పూలు, పండ్లు, అరటి పిలకలు కొనుగోలు చేసేందుకు ప్రజలు తరలిరావడంతో దుకాణాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. దుకాణదారులు, వాహన దారులు పూజలు నిర్వహించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. పట్టణంలోని వివిధ అమ్మవార్ల ఆయలంలో విజయదశమి సందర్భంగా గ్రామోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పలు ఆలయాలను విద్యుద్దీపాలకరణతో ముస్తాబు చేశారు.

హైటెన్షన్ వైరు తగిలి కూలీకి తీవ్రగాయాలు

సూళ్లూరుపేట, అక్టోబరు 11: సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో పెయింటింగ్ పనులు చేస్తున్న కూలీకి శుక్రవారం హైటెన్షన్ వైరు తగిలి తీవ్ర గాయాలయ్యాయి. రైల్వే పోలీసుల కథనం మేరకు... అమృత్ భారత్ పథకం కింద స్టేషన్ ఆధునికీకరణ పనులు చేస్తున్నారు. మురుగ అనే వ్యక్తికి హైటెన్షన్ వైరు సమీపంలో ఇనుప జువ్వలకు పెయింటింగ్ వేస్తుండగా విద్యుదాఘాతం జరగడంతో కిందపడిపోయాడు. గాయపడిన అతడిని వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తీసుకెళ్లారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి ఆత్మహత్య


వృద్ధుడి మృతదేహం

గూడూరు అర్బన్, అక్టోబరు 11: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఓ చెట్టుకు గుర్తుతెలియని వృద్ధుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఒకటో పట్టణ పోలీసుల వివరాల మేరకు... స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ చెట్టుకు శుక్రవారం గుర్తు తెలియని వృద్ధుడు ఉరి వేసుకుని మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శేఖర్‌బాబు సంఘటనాల స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి సుమారు 60 సంవత్సరాలు ఉండొచ్చు. బులుగు రంగు చొక్కా, ఎరుపురంగు పంచె ధరించి ఉన్నాడు.

18 మద్యం దుకాణాలకు 200 దరఖాస్తులు

గూడూరు అర్బన్, అక్టోబరు 11: గూడూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 18 మద్యం దుకాణలకు 200 దరఖాస్తులు దాఖలయినట్లు ఎక్సైజ్ సీఐ కరీమాబేగం శుక్రవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీలో భాగంగా ప్రైవేటు దుకాణాల ఏర్పాటుకు శుక్రవారం రాత్రి 7 గంటల వరకు దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించింది. గడువు ముగిసే సమయానికి గూడూరుకు సంబంధించి 12 దుకాణాలకు గాను 146 దరఖాస్తులు, చిల్లకూరు మండలంలోని 6 దుకాణాలకు 54 దరఖాస్తులు అందగా, రూ.4 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరిందని ఎక్సైజ్ సీఐ తెలిపారు.

శ్రీలక్ష్మమ్మకాలనీలో బాలికా దినోత్సవం

కోట, అక్టోబరు 11: కోట పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం జరిగింది. సీడీపీవో మునికుమారి మాట్లాడుతూ బాలికల ఆవశ్యకతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ పెంచులమ్మ, సూపర్ వైజర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాపురం పంపింగ్ స్టేషన్‌కు
యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

● మంత్రి పొంగూరు నారాయణ



మహమ్మదాపురం వద్దమెగా వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

పొదలకూరు, అక్టోబరు 11: నెల్లూరు నగర ప్రజలకు తాగు నీటిని అందించే మహ మ్మదాపురం పంపింగ్ స్టేషన్‌కు యుద్ధ ప్రాతి పదికన మరమ్మ తులు చేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభి వృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. భారీ వర్షం ఈదురు గాలులకు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్న పొదలకూరు మండలం మహమ్మదాపురం తాగునీటి సరఫరా కేంద్రాన్ని మంత్రి నారాయణ శుక్రవారం సందర్శించారు. మెగా వాటర్ ప్లాంట్ మొత్తాన్ని కలియతిరిగి దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్ల మరమ్మతు గురించి పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ మోహన్‌ను వివరాలడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి మెగా ప్రాజెక్టు డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి పనితీరు మార్చుకోవాలంటూ హెచ్చరించి, యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పూర్తిచేసి నెల్లూరు నగరానికి వెంటనే మంచినీరు అందించే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ నెల్లూరు నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తామన్నారు. ఆదేవిధంగా ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్‌తో నిధులు మంజూరు చేయించి, అమృత్ పథకం ద్వారా రాష్ట్రంలోని 120 మున్సిపాలిటీలలో నిరంతర తాగునీటి సౌకర్యం కల్పించేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నామన్నారు. రాబోవు రెండు సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి బాట పట్టిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ మోహన్, నారాయణ విద్యా సంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి, మెగా వాటర్ ప్రాజెక్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు

● జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తిన కార్తీక్



నూనె ప్యాకెట్ అందజేస్తున్న జేసీ కార్తీక్, వేమిరెడ్డి

నెల్లూరు (వ్యవసాయం), అక్టోబరు 11: నిత్యావసరాల ధరలు నియంత్రణకు ప్రభు త్వం చర్యలు చేపట్టిందని జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తిన కార్తీక్ తెలిపారు. నగరంలోని నవాబుపేట రైతు బజారులో వినియోగదారులకు తక్కువ ధరకు వంట నూనెలు అందించే కౌంటర్‌ను శుక్రవారం రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డితో కలిసి జాయింట్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన బీపీటీ రకం బియ్యం, కందిపప్పు, పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ తక్కువ ధరకు అందించేందుకు జిల్లాలో 18 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా కందిపప్పు కేజీ రూ.150, బీపీటీ రకం స్టీమ్‌బియ్యం కేజీ రూ.45, రా బియ్యం కేజీ రూ.47, పామాయిల్ లీటర్ రూ.110, సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటరు రూ.124 విక్రయిస్తున్నామన్నారు. ఒక్కో రేషన్ కార్డుపై 3 లీటర్ల పామాయిల్, ఒక లీటరు సన్‌ఫ్లవర్ ఆయిల్, అందిస్తామన్నారు. టమోటాలు కేజీ రూ.42, ఉల్లిపాయలు కేజీ రూ.32కు అందిస్తున్నామన్నారు. రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పౌర సరఫరాల వ్యవస్థను పటిష్టం చేసి ప్రజలకు నిత్యవసరాలను సరసమైన ధరకు అందించేందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, పౌరసరఫరాల శాఖ మంత్రి సమష్టి కృషి చేస్తున్నారన్నారు. రేషన్ షాపులను పటిష్టం చేసి, బహిరంగ మార్కెట్లో ధరలను నియంత్రించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో వెంకటరమణ, మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత, తదితరులు పాల్గొన్నారు.

తెల్లరాయి తరలిస్తున్న టిప్పర్ స్వాధీనం



పోలీసుల అదుపులో ఉన్న టిప్పర్

సైదాపురం, అక్టోబరు 11: అక్రమంగా తెల్లరాయి తరలిస్తున్న టిప్పర్‌ను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సర్కిల్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ కాంతికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా తెల్లరాయి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా తెల్లరాయి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కుక్క కాటుతో మహిళకు తీవ్ర గాయాలు

అనంతసాగరం, అక్టోబరు 11: మండలంలోని లింగంగుంటకు చెందిన రెడ్డిమళ్ల లక్ష్మమ్మపై శుక్రవారం ఉదయం కుక్క దాడిచేసి కరవడంతో ఆమెకు తీవ్ర గాయమైంది. కుటుంబసభ్యులు స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించి ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు.

గంజాయి విక్రేత అరెస్టు

కోవూరు, అక్టోబరు 11: జిల్లాలోని పలు ప్రాంతాల్లో గంజాయిని విక్రయిస్తున్న ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఇమామ్ హుస్సేన్‌ను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయమై సీఐ సుధాకర్‌రెడ్డి స్థానిక సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను తెలిపారు. పడుగుపాడు రైల్వేస్టేషన్ సమీపంలో 10కిలోల గంజాయిని మోటార్‌బైక్‌లో తీసుకువెళ్తున్న సమాచారం మేరకు కోవూరు ఎస్‌ఐ రంగనాథ్ గౌడ్ సిబ్బందితో ముందస్తుగా కాపు కాచి నిందితుడితో పాటు గంజాయిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రంగనాథ్ గౌడ్, పోలీసులు సునీల్‌కుమార్, రషీద్‌లను ఆయన అభినందించారు.

మాజీ హోంగార్డు అరెస్టు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 11: సీఐ ఐడీ పార్టీ కానిస్టేబుల్‌నంటూ వైద్యుడిని బెదిరించడమే కాకుండా నగదు డిమాండ్ చేసిన మాజీ హోంగార్డును బాలాజీనగర్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం అంబాపురంకు చెందిన రియాజ్ పోలీసుశాఖలో గతంలో హోంగార్డుగా పనిచేశారు. ఆయన ఈనెల 8వ తేదీ రాత్రి అపోలో వైద్యశాల జంక్షన్ వద్ద బైక్‌పై ఇంటికి వెళుతున్న వైద్యుడు విశ్వనాథ్‌ను అడ్డగించి నగదు బెదిరించడమే కాకుండా నగదు డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడుని శుక్రవారం అరెస్టు చేసినట్లు బాలాజీనగర్ పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి

కొవ్వూరు, అక్టోబరు 11: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఒక వృద్ధురాలు మృతి చెందినట్లు తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు ఎస్‌ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. నెల్లూరు జిల్లా ఇందుకూరుపేటకు చెందిన పులి కాటయ్య అతని భార్యలు అనంతమ్మ (73), సుబ్బమ్మలు కొంతకాలం క్రితం కొవ్వూరు వచ్చేశారు. ఫినాయిల్ అమ్ముకుంటూ కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి టోల్‌గేటు వద్ద నివాసం ఉంటున్నారు. కొంత కాలం క్రితం కాటయ్య మృతి చెందాడు. శుక్రవారం అనంతమ్మ(73) రాజమహేంద్రవరం ఆసుపత్రికి వెళ్లడానికి టోల్‌గేటు సెంటర్‌లో రోడ్డు ప్రక్క నిల్చుంది. నిడదవోలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాజమహేంద్రవరం నుంచి నిడదవోలు వెళుతూ టోల్‌గేటు వద్ద నిల్చున్న అనంతమ్మను ఢీకొట్టగా తీవ్రంగా గాయపడింది. సమాచారం తెలిసిన వెంటనే కొవ్వూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన అనంతమ్మను కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ధృవీకరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతురాలికి వరుసకు చెల్లెలు అయిన సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు ఎస్‌ఐ జగన్మోహనరావు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	136
లేయర్ లైవ్	118
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	268
లేయర్	200

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7303
వెండి కిలో ధర	రూ. 92,500
వెండి ఒక గ్రాము	రూ. 95.50

జగన్ మహిషాసురుడి కంటే ప్రమాదం

- మంత్రి నారాయణతోనే నెల్లూరు నగరాభివృద్ధి సాధ్యం
- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 11 : జగన్మోహన్‌రెడ్డి మహిషాసురుడు కంటే ప్రమాదకరమని, ఆయన ఓడిన తర్వాత ఏపీకి మంచి రోజులు వచ్చాయని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు వైసీపీకి 11 సీట్లు ఇచ్చినా జగన్మోహన్‌రెడ్డికి ఇంకా బుద్ధి రాలేదంటూ మండిపడ్డారు. ప్రజలు మరచి పోతారన్న ఉద్దేశంతో జగన్ ప్రభుత్వం మీద అవినీతి ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్టాన్ని మాజీ సీఎం జగన్ విధ్వంసం చేసి పోతే కేవలం 4 నెలల్లో టీడీపీ అధినేత చంద్రబాబు గాడిలో పెడుతున్నారని అన్నారు. బాడ్ బాయ్ గుడ్ బుక్ ఎలా రాస్తాడని ఎద్దేవా చేశా రు. జగన్ దెబ్బకు పరారైన కంపెనీలు చంద్రబాబు సమర్థతను చూసి తిరిగి వస్తున్నాయని చెప్పారు. రూ.60 వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయని వెల్లడించారు. రాబోయే ఐదేళ్లలో 25 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా చం ద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటి కైనా చేతగాని దద్దమ్మ మాటలు జగన్ మానుకోవాలని హితవు పలికారు. పార్కులను తానే అభివృద్ధి చేశామని మాజీ మంత్రి అనిల్‌కుమార్ మాట్లాడటం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. నెల్లూరు నగరంలో ఇప్పటికే అండర్‌గ్రౌండ్ పనులు ప్రారంభమయ్యాయని, తాను నుడా చైర్మన్‌గా ఉన్న సమయంలో మంత్రి నారాయణతో కలిసి ఎన్నో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. ఇప్పుడు కూడా నారాయణ సారథ్యంలో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరప్రసాద్, పిట్టి సత్యనారాయణ, కప్పిర శ్రీనివాసులు, ప్రశాంత్, జాకీర్, మొయినుద్దీన్, రేవతి పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

● జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్



భేటీ బచావో, భేటీ పడావో అన్న ప్లకార్డులను ప్రదర్శిస్తున్న అధికారులు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 11 : మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జరిగింది. డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా డీసీపీవో సురేష్ మాట్లాడుతూ కన్యా శుల్కం, బాల్య వివాహం, జోగి వ్యవస్థ, మాతంగి కన్యలు వంటి వ్యవస్థను అధిగమించినా సాం ఘికంగా, ఆర్థికంగా, లైంగికంగా మహిళలు, బాలికలు అణచివేతకు గురవుతూనే ఉన్నార న్నారు. అయితే ఇన్ఫోసిస్ డైరెక్టర్ సుధామూర్తి, పాకిస్తాన్‌లో మలాల, దివంగత ప్రధాని ఇందిరాగాంధీ, సిరిమావో బండారు నాయక్, ఖలీదా జియా, బెనజీర్ భుట్టో వంటి మహిళలు వివక్షతకు గురై ఉన్నత శిఖరాలకు అధిగమించారన్నారు. సీడీపీవో లక్ష్మీదేవి మాట్లాడుతూ 'భవిష్యత్తులో బాలికల కోసం' అనే నినాదంతో ముందుకు వెళుతున్నామన్నారు. మహిళల అభ్యున్నతి కోసం కంకణం కట్టుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం భేటీ బచావో.. భేటీ పడావో అన్న నినాదంతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో దిశా సీఐ కృష్ణారెడ్డి, ఐటీడీఏ ఏఎల్‌వో శాంతి, గర్ల్ చైల్డ్ అధికారి మమత, దిశా ఏఎస్‌ఐ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు చైల్డ్ ఆశ్రమానికి బాలల అప్పగింత



ఇద్దరు బాలలను చైల్డ్ వెల్ఫేర్ ఆశ్రమానికి అప్పగిస్తున్న పోలీసులు

సంగం, అక్టో బరు 11: బాతుల యజమాని పెట్టే బాధలు భరించలేక పరారైన బాలలను చేరదీసిన పోలీసులు గురువారం వారిని అల్లూరులోని చైల్డ్ ఆశ్రమానికి అప్పగించారు. పోలీసుల వివరాల మేరకు.. గుడ్లూరు మండలానికి చెందిన సుశీలమ్మ, బోడెయ్యలు తమ బాతులు మేపేందుకు దగదర్తి మండలం కాంట్రాయపాడుకు చెందిన ఏలూరు చెంచయ్య, చెంచమ్మ పిల్లలు భవానీ, దుర్గ అనే ఇద్దరు మైనర్ బాలురను ఐదేళ్ల కిందట జీతానికి తీసుకు వచ్చారు. అటు జీతం ఇవ్వకపోవడంతో పాటు బాతుల వద్ద సక్రమంగా కాపలా ఉండడం లేదని వేధిస్తున్నారు. ఈక్రమంలో వారు బాధలు భరించలేక యజమానికి తెలియకుండా తల్లిదండ్రుల వద్దకు వెళ్లే క్రమంలో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో బాతుల యజమాని నిర్వాకం వెలుగుచూసింది. ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు డీసీపీవో సురేష్, సీడీపీవో సునీలత, వీఆర్వో స్థానిక పోలీస్‌స్టేషన్‌కు విచ్చేసి బాలలు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారి సమక్షంలోనే అల్లూరులోని చైల్డ్ ఆశ్రమానికి అప్పగించారు. అనంతరం చైల్డ్ యాక్ట్ ప్రకారం బాతుల యజమానిపై కేసు నమోదు చేశారు.

కాంట్రాక్ట్ లెక్చరర్స్‌ను రెగ్యులర్ చేయాలి

● మంత్రి నారా లోకేష్‌కు జేఏసీ వినతి



నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నేతలు

నెల్లూరు (విద్య), అక్టోబరు 11: ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన కాంట్రాక్ట్ లెక్చరర్ల రెగ్యులైజేషన్ ప్రక్రియను తిరిగి కొనసాగించి రాష్ట్రంలోని 3,618 మందిని రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ నేతలు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఉండవల్లిలో మంత్రికి వినతిపత్రం అందచేసి మాట్లా డారు. జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పనిచేసే నాన్ టీచింగ్ క్యాడర్ నుంచి ఒకేషనల్ జూనియర్ లెక్చరర్ 25 శాతం కోటా ప్రమోషన్స్ విషయంలో ప్రస్తుతం పనిచేసే వారిని మినహాయించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎలాంటి భద్రతా, బెనిఫిట్స్ లేకుండా పనిచేస్తున్న లెక్చరర్స్ సర్వీస్‌ను 62 ఏళ్లకు పొడిగించాలన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో 11 నెలలు మాత్రమే జీతాన్ని అందించారని, మే నెలలో పనిచేసినా కోల్పో యిన జీతాన్ని ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర చైర్మన్ కుమ్మరకుంట సురేష్, కోచైర్మన్ కల్లూరి శ్రీనివాస్, వైస్ చైర్మన్ బి.వీరయ్య, నాయకులు ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

● రూ.3 లక్షల నగదు, 15 సవర్ల నగలు అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సుమన్

కలువాయి, అక్టోబరు 11 : ఓ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ జరిగిన సంఘటన స్థానిక మాజీ సర్పంచు గుడిగుంట శ్రీనివాసులు వీధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కలువాయికి చెందిన యడ్ల సురేష్‌కుమార్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఆయన భార్య స్వరాజ్యలక్ష్మీ న్యాయవాది. హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న వీరి కుమారుడు విజయవాడ నుంచి నెల్లూరుకు వచ్చి ఉంటున్నారు. ఈనెల 7వ తేదీన సురేష్‌కుమార్ కుటుంబం ఇంటికి తాళం వేసుకుని నెల్లూరులోని కుమారుడి వద్దకు వెళ్లారు. కాగా, శుక్రవారం రాత్రి కలువాయిలో ఓ వివాహ కార్యక్రమం ఉండటంతో సురేష్‌కుమార్ ఒక్కడే కలువాయికి వచ్చి ఇంటికి వెళ్లి చూడగా ప్రధాన ద్వారం పగలగొట్టి ఉంది. దీంతో ఇంట్లో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ సుమన్ పరిశీలించారు. ఇంటికి తాళం వేసి ఉండటంతో ఇంట్లో ఎవ్వరూ లేరన్న విషయాన్ని గుర్తించిన దుండగులు ఈ చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. క్లూస్‌టీం సిబ్బంది వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

- వాటి అజమాయిషీలోనే ఆలయాల్లో కార్యకలాపాలు
- పాలకులు, అధికారుల పెత్తనానికి ఇక చెల్లు
- జిల్లాలోని 200 దేవాలయాల్లో కమిటీల ఏర్పాటు



నెల్లూరు తల్పగిరి రంగనాథస్వామి ఆలయం

వైదిక కమిటీల మాటే వేదం

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 11: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని ఆలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ కూటమి ప్రభుత్వం జీవో జారీ చేసింది. గత వైసీపీ హయాంలో దేవాలయాల్లో కల్యాణో త్సవాలు, హోమాలు, యాగాలు, కుంభాభిషేకాలు, ఇతర సేవల నిర్వహణలో రాజకీయ నేతలతోపాటు ఈవో స్థాయి నుంచి కమిషనర్ వరకు జోక్యం ఉండేది. దీంతో ఆ ఐదేళ్లలో ఆలయాలన్నీ పూర్వవైభవం కోల్పోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆలయాలకు పూర్వ వైభవం తెస్తా మన్న నేతల హామీ నేడు నెరవేరింది.

జిల్లాలో 1203 నోటిఫైడ్ ఆలయాలు ఉన్నాయి. ఇందులో కమిషనర్ పరిధిలో మాలకొండ, పెంచల కోన, వేణు గోపాల స్వామి, రాజరాజేశ్వరి, జొన్నవాడ కామాక్షి తాయి ,తల్పగిరి రంగనాథ స్వామి, నర్రవాడ వెంగమాంబ ఆలయాలు ఉన్నాయి. డిప్యూటీ కమిషనర్ పరిధిలో 52 ఆలయాలు, జిల్లా సహాయ కమిషనర్ పరిధిలో సుమారు 113 ఆలయాలకుపైగా ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చిన జీవోతో సుమారు 200 ఆలయాల్లో పాలకులు, అధికారుల పెత్తనానికి చెక్ పడినట్టే. ఇక నుంచి ఆలయాల సంప్రదాయాలు, వైదిక, ఆగమ వ్యవహారాల్లో ఈవో నుంచి కమిషనర్ స్థాయి అధికారులెవరూ జోక్యం చేసుకోరాదు. ప్రభుత్వం జీవో ప్రకారం ప్రతీ ఆలయంలోనూ వైదిక కమిటీని ఏర్పాటు చేస్తారు. ఆ కమిటీ సూచనలను రాష్ట్ర దేవదాయ కమిషనర్ నుంచి ఈవో స్థాయి అధికారులు పాటించాలి. ఆలయాల్లో వివిధ సేవా టికెట్ల ధరలు, నిర్ణయం ఇక నుంచి వైదిక కమిటీలదే. అలాగే కల్యాణోత్సవ ముహూర్తాలు, యాగాలు, కుంభాభిషేకాలు, కొత్త పూజల ప్రారంభం వంటి అంశాలలో వైదిక కమిటీ లేదా ప్రధాన అర్చకుడి సూచనలు పాటించాలి. 6ఏ (రాష్ట్ర కమిషనర్ పరిధి) ఆలయాల్లో తక్షణం వైదిక ఆగమ కమిటీలను ఏర్పాటు చేయాలి.

త్వరలో కమిటీల ఏర్పాటు

ఆలయాలకు స్వయంప్రతిపత్తిపై జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్ రెడ్డిని వివరణ కోరగా, ఇప్పటికే ప్రభుత్వం జీవో విడుదల చేసిందని తెలిపారు. కమిషనర్ నుంచి ఇంకా ఎలాంటి సూచనలు అందలేదన్నారు. కమిషనర్ సూచనల మేరకు జిల్లాలోని ఆలయాల్లో వైదిక, ఆగమ కమిటీలను నియమిస్తామని పేర్కొన్నారు.

పీకేపాడు అటవీ ప్రాంతంలో చిరుత?

అనంతసాగరం, అక్టోబరు 11: మండలంలోని పడమటికంబంపాడు అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు శుక్రవారం పుకార్లు చెలరేగాయి. ధర్మపల్లెమ్మ గుడి సమీపంలో చిరుత వేలిముద్రలు, ఆనవాళ్లు గొర్రెలకాపరులు గుర్తించారని సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈవిషయంపై అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

సోమశిలలో 52.350 టీఎంసీల నీరు నిల్వ

అనంత సాగరం, అక్టోబరు 11: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శుక్రవారం 7,100 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 52.350 టీఎంసీలుగా నమోదైంది. దిగువ డెల్టాకు 2,000, కండలేరుకు 8,500, ఉత్తర కాలువకు 540, దక్షిణ కాలువకు 5 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

దసరా.. విజయానికి ప్రతీక : కలెక్టర్

నెల్లూరు (సాంస్కృతికం) : విజయదశమి అంటే విజయానికి ప్రతీక అని, జిల్లావాసులందరికీ ఈ విజయదశమి సరికొత్త విజయాలు అందించాలని కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అన్ని వర్గాల ప్రజలకు చేరవేస్తూ, అన్ని రంగాల్లో జిల్లాను ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు జిల్లా ప్రజలపై పుష్కలంగా ఉండి అందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అలాగే జాయింట్ కలెక్టర్ కార్తీక్ కూడా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

● **నెల్లూరు(హరనాథపురం) :** విజయదశమి పర్వదినం సందర్భంగా ప్రతి ఇంట్లో సుఖశాంతులు వెల్లివిరియాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు ప్రకటనలో ఆకాంక్షించారు. దసరా సందర్భంగా వారు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలన్నారు.



రథంపై శ్రీవారి చిద్విలాసం

కమనీయం శ్రీవారి రథోత్సవం

కావలి టౌన్, అక్టోబరు 11: స్థానిక బృందావనం కాలనీ వెంకటేశ్వర స్వామికి శుక్రవారం ఉదయం భక్తులు రథోత్సవం నిర్వహించారు. రాత్రి అశ్వవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. టీటీడీ అర్చక బృందంతో చేపట్టిన ఉత్సవాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరామ్ మాల్యాద్రి పర్యవేక్షించారు. రథోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు, మహిళల కోలాటాలతో ప్రాంగణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

ఆర్టీవో అధికారుల తనిఖీలు

కావలి రూరల్, అక్టోబరు 11: స్థానిక ముసునూరు టోల్ గేట్ వద్ద గురువారం అర్ధరాత్రి నుండి శుక్రవారం ఉదయం వరకు ఆర్టీవో అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బి.చందర్ ఆదేశాల మేరకు సరుకులతో హైదరాబాద్‌కు వెళ్తున్న 5బస్సులను గుర్తించి కేసులు నమోదు చేసినట్లు కావలి ఎంవీఐ సుందర్‌రావు తెలిపారు. ప్రయాణికులతో పాటు సరుకులు రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కావలి ఎంవీఐ సుందర్‌రావు, జిల్లా స్క్వాడ్ ఎంవీఐ గోపీనాయక్ పాల్గొన్నారు.



దుర్వాసనతో జనం అవస్థ

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 11 : మద్రాసు బస్టాండు సెంటర్‌లో అన్న క్యాంటీన్ వద్ద శుక్రవారం డ్రైనేజీ నీరు పొంగి రోడ్డుమీద ప్రవహించింది. ఆ డ్రైనేజీ మురుగు వల్ల కోనేటి మార్కెట్, ఏసీ మార్కెట్‌కి వచ్చే జనం, వ్యాపారులు దుర్వాసనతో అవస్థలు పడ్డారు. తరచూ ఇలా డ్రైనేజీ పొంగి ఇబ్బందులు పడుతున్నామని, వ్యాపారులు వాపోతున్నారు.

నత్తనడకన పనులు..



అమ్మపాలెం, కొండసముద్రం గ్రామాల్లో మినహా మిగిలిన 13గ్రామాల పరి ధిలో వైసీపీ ప్రభుత్వం పాల సేకరణ కేంద్రాలు నిర్మాణ పనులు చేపట్టారు. ఒక్కో కేంద్ర భవన నిర్మాణానికి రూ.18 లక్షలు నిధులు మంజూరు చేసింది. అయితే నిర్మాణాలలో ఆశించిన పురో గతి కనిపించ లేదు. పథకం పనులు ప్రారంభించి మూడేళ్లయినా ఇంకా అసం పూర్తిగానే దర్శనం ఇస్తున్నాయి. మండలానికి 15పాలసేకరణ కేంద్రాలు మంజూరు 2మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 13పాలసేకరణ కేంద్రాలు పనులు నిలిచి లక్షలాది రూపా యలు ప్ర జాధనం వృథా అయ్యింది.

- వలేటివారిపాలెం